సత్యం శివం సుందరం
శ్రీ సరస్వతీ విద్యాపీఠము

# స్ఫూర్తి

విద్యావిషయక మాస పత్రిక

సంపుటి : 50 సంచిక : 05 వెల : రూ. 18/- పుటలు : 36

శ్రీ పరాభవ నామ సంవత్సరం, వైశాఖ-జ్యేష్ఠ మాసములు మే : 2026



## కార్య సాధకుడు హనుమ మనకాదర్శం



కరీంనగర్ : స్థానిక సరస్వతీ శిశు మందిర్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో ఆధునిక కంప్యూటర్ లాబ్‌ను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథులుగా బల్మూరి కరుణాకర్ రావు, ఇంజనీర్ కోల అన్నా రెడ్డి, ఎలగందుల సత్యనారాయణ, గట్టు శ్రీనివాస్, గుర్రాల మహేశ్వర్ రెడ్డి, శ్రీరాం మొండయ్య, బొడ్ల శ్రీనివాస్, బొడ్ల గీతారాణి పాల్గొన్నారు. కంప్యూటర్ లాబ్‌ను ప్రారంభించిన అనంతరం విద్యార్థులతో మాట్లాడిన అతిథులు, సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించడం ద్వారా భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకో వచ్చని సూచించారు. డిజిటల్ యుగంలో కంప్యూటర్ పరిజ్ఞానం అత్యవసరమని పేర్కొన్నారు. పాఠశాల ప్రధానాచార్యులు మోర రణధీర్ మాట్లాడుతూ, ఈ కొత్త ల్యాబ్ ద్వారా విద్యార్థుల్లో డిజిటల్ నైపుణ్యాలు పెరగడంతో పాటు  ప్రాయోగిక జ్ఞానం కూడా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటుపై డాక్టర్ చక్రవర్తుల రమణాచారి, కొత్తూరి ముకుందం, గట్టు రాంప్రసాద్, నడిపెల్లి దీన్ దయాల్ రావు, అప్పిడి వకుళ దేవి, మేచినేని దేవేందర్ రావు, రాపర్తి శ్రీనివాస్, పాక పావన క్రిష్ణ, కొలుగురి సదాశివ రెడ్డి, డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, పులల శ్యామ్, తాటి రాజేశ్వర్ రావు, తణుకు మహేష్, ఆచార్యులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.





ఖమ్మం–రామకృష్ణ విద్యాలయం:–

సంస్కృతి, సంప్రదాయాలతో పాటు ఆధునిక సాంకేతికత కూడా విద్యార్థులకు కావాల్సిందే. రెండు ధోరణులూ వేర్వేరు అయినా.. విద్యార్థులు మాత్రం రెంటినీ సమ్మిళితం చేసి, అధ్యయనం చేయాలి. అప్పుడే “సర్వాంగీణ వికాసం” (Holistic approach)  సాధ్యం. శ్రీ సరస్వతీ విద్యాపీఠం శతధా ఈ ప్రయత్నాలు చేస్తోంది. మన లక్ష్యం లో అనుకున్న విధంగా విద్యార్థులుఅన్ని రకాల అభివృద్ధిని సాధించాలని సంకల్పం తీసుకున్నారు. ఇందులో భాగంగా ఖమ్మంలోని శ్రీ రామకృష్ణ విద్యాలయంలో నూతన computer lab ను అతిథులు విద్యార్థుల కు అందుబాటులోకి తెచ్చారు. విద్యాపీఠం ప్రాంత శైక్షణిక్ ప్రముఖ్ నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచా ర్యులు, క్షేత్ర శిశు వాటికా ప్రముఖ్ కోవెల శ్రీనివాసాచార్యులు, వేమవరపు సుబ్బారావు, వేంకట శ్రీనివాసరావు, బోనాల రామకృష్ణ, జయంత్ పటేల్ గార్లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# స్ఫూర్తి

విద్యావిషయక మాస పత్రిక

కలియుగాబ్ది-5128, శాలివాహన శక సం. 1948, శ్రీ పరాభవ నామ సంవత్సరం వైశాఖ-జ్యేష్ఠ మాసములు

సంపుటి : 50, సంచిక : 05, మే 2026, పుటలు : 36, వెల : రూ.18/-

సంపాదకులు

**డా॥ అన్నదానం వేం. సుబ్రహ్మణ్యం**

ప్రచురణ కర్త

**పసర్తి మల్లయ్య**

**సంపాదకమండలి**

రావుల సూర్యనారాయణ

రమా విశ్వనాథన్

గోపగోని సప్తగిరి

అన్నావఝ్ఝుల శ్రీనాథ్

పతకమూరి శ్రీనివాసరావు

**ముద్రణ**

సాయి లిఖిత ప్రింటర్స్, ఖైరతాబాద్,
హైదరాబాద్-500004

**డి.టి.పి.**

**స్ఫూర్తి గ్రాఫిక్స్**

శ్రీ సరస్వతీ విద్యాపీఠము,
ఖైరతాబాద్, హైదరాబాద్ - 500004

**స్ఫూర్తి చందా వివరములు**

**స్ఫూర్తి వార్షిక చందా రూ॥ 220-00 లు**

యం.ఓ./ డి.డి. ద్వారా
శ్రీ సరస్వతీ విద్యాపీఠము పేరున
క్రింది చిరునామాకు పంపగలరు.

**శ్రీ సరస్వతీ విద్యాపీఠము**
ఇ.నెం. 6-3-597/ఎ/7,
వేంకటరమణ కాలనీ,
ఖైరతాబాద్, హైదరాబాద్ - 500 004.
ఫోన్ : 040-23316160, 23316084
e - mail :sphoortissvp@gmail.com

## అమృతవాణి

శ్లో॥ సత్యం మాతా, పితా జ్ఞానం, ధర్మోభ్రాతా, దయా సఖా ।
శాంతి: పత్నీ, క్షమా పుత్ర:, షడతే మమ బాంధవా: ॥

**భావము :** సత్యమే తల్లి, జ్ఞానమే తండ్రి, ధర్మమే సోదరుడు, దయయే మిత్రుడు, శాంతమే ధర్మపత్ని, క్షమయే పుత్రుడు. ఈ ఆరుగురూ నా ఆప్త బంధువులు.

## ఈ సంచికలో . . .

| | |
|---|---|
| సంపాదకీయము | ... 04 |
| హనుమంతుని వలె కార్యసాధకులు కావాలి | ... 05 |
| పద్యంలో పరమ వైభవం | ... 09 |
| పోతన భాగవతము | ... 11 |
| చిత్రమాలిక | ... 17 |
| శిశుమందిర్ బాలలు గీసిన చిత్రాలు | ... 21 |
| లోకజ్ఞానం - 210 | ... 22 |
| సెలవుల్లో ఇలా! | ... 23 |
| పునాది అక్షరాస్యత | ... 25 |
| మన సంస్కృతి-మహావారధి | ... 29 |
| బారిపడా గ్రామ రక్షకుడు పద్మశ్రీ చైత్‌రామ్ పవార్ | ... 31 |
| వార్తలు | ... 33 |

Printed & Published by **Pasarti Mallaiah** on behalf of Sri Saraswathi Vidya Peetham (Owner) and Printed at **Sai Likhita Printers**, # 6-2-959, D.B.Hindi Prachar Sabha Complex, Khairatabad, Hyd - 500004 and Published at Sri Saraswathi VidhyaPeetham, # 6-3-597/A/7, Venkataramana Colony, Khairatabad, Hyd - 500004 (Publication Place) Editor : **Dr. Annadanam Venkata Subrahmanyam.**

# సుప్రీం తీర్పు-మత మార్పిడులకు ముగింపు

విదేశీ విధర్మీయ దురాక్రమణలు జరిగిన తరువాతనే మన దేశంలో ముస్లిం, క్రైస్తవ మతస్థులు ఏర్పడ్డారు. అలాంటి వారు ఏ కారణంగా మతం మారారు అనే చర్చ ఇక్కడ చేయడం లేదు. ఆ దాడుల కంటె ముందు ఈ దేశంలో ముస్లిం, క్రైస్తవ మతస్థులు లేరనేది నిర్వివాదాంశం. ఈ దేశంలోకి విధర్మీయులు వచ్చినప్పటి నుండి మత మార్పిడులు అప్రతిహతంగా కొనసాగుతూనే ఉన్నాయి. హిందూత్వం లోని కుల వివక్ష, అంటరానితనం వంటి దురాచారాలు ఆయా మతాలలో ఉండవని అసలు కులాలే ఉండవని కూడా చెప్పి మభ్యపెట్టో, ప్రలోభపెట్టో మతం మార్చేవారు. వాస్తవంగా కూడా వారి బోధనల ప్రకారం మతం మారితే పూర్వ మతంలోని కులం అంతరించిపోతుంది.

అయితే మన దేశంలోని హిందూ సమాజంలోని షెడ్యూల్లు కులస్థులకు, షెడ్యూల్లు తెగలవారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రిజర్వేషన్ సౌకర్యాలు కల్పించి అమలు చేస్తున్నాయి. ఇటీవల సుప్రీం కోర్టు అక్రమ మతమార్పిడులకు అడ్డుకట్ట వేస్తూ మార్చి నెలలో ఒక తీర్పు వెలువరించింది. ఇటువంటి తీర్పునే గతంలో ఆంధ్రప్రదేశ్ వంటి హైకోర్టులు కూడా వెలువరించాయి. ఇప్పుడీ సుప్రీం కోర్టు తీర్పు వాటిని పూర్తిగా సమర్థించినట్లైంది. తీర్పు కారణంగా భారత దేశంలో ఎక్కడా అక్రమ మతమార్పిడులు జరగడానికి వీలులేదని స్పష్టమైంది. హిందువులుగా, బౌద్ధులుగా, సిక్కులుగా ఉన్న షెడ్యూల్డు కులస్థులు ఎవరైనా ఇతర మతాలను స్వీకరించినట్లయితే వారు అప్పటి వరకు పొందుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించే రిజర్వేషను సౌకర్యాలనన్నిటినీ కోల్పోతారు అని స్పష్టంగా తీర్పు చెప్పింది. దీంతో బాటు అప్పటి వరకు వారికున్న యస్.సి. హెూదాను యస్సీ చట్టం కింద లభించే రక్షణను, రక్షణ హక్కులను కూడా కోల్పోతారని తెలియజెప్పింది. ఈ తీర్పుతో మతం మారిన వారు ఉలిక్కిపాటుకు గురవుతున్నారు. భవిష్యత్తులో నష్టాలకు గురవుతామని లోలోపల వాపోతున్నారు. తెలివిగల వాళ్ళు ఘర్ వాపస్ కావాలని తమ మూలాలను మరచి పోకూడదని వెదుకులాట ప్రారంభిస్తున్నారు. అదే సమయంలో మెజారిటీ హిందూ సమాజం తమ సమాజం బలపడుతుందని విభేదాలు అంతరించి పోతాయని ఆశగా ఎదురుచూస్తోంది. స్వార్థ రాజకీయ నాయకులకు మాత్రం ముద్ద మింగుడు పడటం లేదు. సుప్రీం కోర్టు తీర్పు భారతీయ సమాజానికి రక్షణ కవచం లాంటిది.

అలాగే ఛత్తీస్ గఢ్ హైకోర్టు క్రైస్తవ మత బోధకులు గిరిజనులను ప్రలోభాలకు గురిచేసి మోసపూరిత పద్ధతుల్లో మాతమార్పిడులు చేస్తున్నారని గుర్తించి వాటిని అరికట్టడానికి హెూర్డింగ్‌లు ఏర్పాటు చేయడం రాజ్యాంగ విరుద్ధం కాదని తీర్పు చెప్పింది. ఇప్పుడు గౌరవనీయ సుప్రీం కోర్టుకూడ దిగ్బాల్ తాండాలలో ఛత్తీస్‌గడ్ ప్రభుత్వం మరియు ఇతరులు దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టి వేస్తూ ఛత్తీస్‌గడ్ హైకోర్టు తీర్పును సమర్థించింది. దీని వల్ల మత మార్పిడులను అరికట్టడానికి ఏర్పాటు చేసే హెూర్టింగులు రాజ్యాంగ విరుద్ధం కాదని స్పష్టమైంది. పైగా 16 ఫిబ్రవరి 2026న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో పెసా (PESA) చట్టం ప్రకారం గ్రామ సభలకు తమ సామాజిక, సాంస్కృతిక సంప్రదాయాలను రక్షించుకునే పూర్తి హక్కు ఉందని కూడా స్పష్టం చేసింది. గ్రామ సభలు నామ మాత్రపు సంఘాలు కావని అవి నిజమైన స్వయం పాలనా వ్యవస్థలని నొక్కి చెప్పింది. ఈ రెండు తీర్పులు అభినందించదగినవే హిందూ సమాజ పటిష్ఠతకు దోహదపడేవి. గ్రామాభివృద్ధికి చేయూత నిచ్చేవి కూడా. బ్రిటిష్ వాళ్లు దేశంలోకి వచ్చాకే ఈ దేశాన్ని సాంస్కృతికంగా, సామాజికంగా, ఆర్థికంగా నాశనం చేయడానికి గ్రామీణ వ్యవస్థ, పంచాయితీ వ్యవస్థ పై దెబ్బ కొట్టారు. దాని దుష్ఫలితాలను చాల సం॥రాలు అనుభవిస్తూ వచ్చింది. సమాజం కనీసం ఇప్పుడైనా కళ్ళు తెరిచి దేశ పునర్వైభవానికి ఆయా రంగాలలో రావలసిన మార్పులు గురించి ఆలోచించి సమాజం సరియైన మార్పు దిశగా అడుగులు వేస్తూ కృషి చేస్తోందని ఆశిద్దాం ! సమాజం మత మార్పిడులు జరగకుండా రిజర్వేషన్లు దురుపయోగం, నిరుపయోగం కాకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటుందని కూడ ఆశిద్దాం ! ★

ముఖ చిత్రకథనం

# హనుమంతుని వలె కార్యసాధకులు కావాలి



హనుమజ్జయంతి
వైశాఖ.బ.దశమి

- డా॥ అన్నదానం వేం.సుబ్రహ్మణ్యం

**బుద్ధిర్బలం యశోధైర్యం నిర్భయత్వ మరోగతా ।**
**అజాడ్యం వాక్పటుత్వంచ హనుమత్స్మరణాద్భవేత్ ॥**

బుద్ధి, బలము, యశస్సు, ధైర్యము, నిర్భయత్వము, ఆరోగ్యము, అజాడ్యము, వాక్పటిమ మొదలైన 8 గుణములు హనుమంతుని స్మరణ మాత్రం చేతనే కలుగుతాయి. అని ఈ శ్లోక భావము. అంటే యీ శ్లోకం చదువుకుంటూ కూర్చున్నంత మాత్రాన కలుగుతాయని కాదు. హనుమంతుడు జ్ఞాన గుణసాగరుడు. ప్రత్యక్ష దైవము సూర్యభగవానుని వద్ద సకల శాస్త్రములను అధ్యయనం చేసి యీ గుణములను సంపాదించుకున్నాడు. కాబట్టి యీ గుణములను నేటి యువతరం సాధన చేసి సంపాదించుకోవాలి. హనుమ ఆ విధంగానే సాధించుకున్నాడు. కాబట్టి ప్రతి వ్యక్తికి అభ్యాసము, సాధన యీ రెండూ అవసరము.

మన ప్రాచీన గ్రంథాలు, పురాణ గాథలు, మానవుడిని ఉత్తమ మార్గంలో నడిపిస్తుంటాయి. యధా దృష్టి తథా సృష్టి. మన దృష్టిని బట్టే అన్నీ గోచరిస్తుంటాయి. మనిషి అస్తి నాస్తి విచికిత్సలో పడకూడదు. విశ్వాసం, నమ్మకం ఉండాలి. గెలుపోటములు ముందు మనసులోనే జరుగుతుంటాయి. ఆ తరువాత అవి ప్రత్యక్షరూపంలో గోచరిస్తుంటాయి. హనుమంతుని జీవితం, కార్యనిర్వహణా దక్షత ఈనాటి యువతరానికి అత్యంతావశ్యకం. మనిషి క్రియాశీలంగా ఉండాలి. కార్యసాధకుడు కావాలి కాని నిష్క్రియా పరుడుగా ఉండకూడదు. హనుమంతుని తలచుకుంటే చాలు ప్రతి వ్యక్తిలో ఆత్మవిశ్వాసం కలుగుతుంది. లోపలి శక్తి జాగృతమవుతుంది. సహజంగానే కార్యోన్ముఖుడవుతాడు. కర్తవ్య పరాయణుడై సఫలీ కృతుడవుతాడు. కాబట్టి వేదవాఙ్మయము, పురాణ ఇతిహాసికాలు మానవుడిని మానవోత్తముడుగా



తీర్చిదిద్దుతాయి. అందుకే రామాయణాది గ్రంథాలు అందులోని పాత్రలు నిత్యనూతనాలు. నిత్య సత్యాలు. శాశ్వతాలు.

నేడు కొందరు కుహనా మేధావులు ఆంగ్లభాషా, సంస్కృతుల ప్రభావంలో పడి రామాయణ, భారతాదులను పుక్కిటి పురాణాలని, కల్పితాలనే భ్రమలో పడి దానినే దుష్ప్రచారం చేస్తున్నారు. అభ్యుదయ వాదం, ఆధునిక వాదం పేరుతో ప్రాచీన భారతీయ సాహిత్యాన్ని, గాథలను కొట్టి పారేస్తున్నారు. వాస్తవానికి అవి ఐతిహాసిక సత్యాలనే విషయంలో అనేక ఆధారాలు లభ్యమవుతున్నాయి. ఏది యేమైనా ఆర్షవాఙ్మయమే నేటికీ శిశువులు పశువులుగా మారకుండా పురుషోత్తములు కావడానికి దోహద పడుతోంది. అందుకే ఆ గ్రంథాలు, గాథలు యీ జాతికి ప్రాణం, ఊపిరి. సామాజికంగా కాని, దేశీయంగా కాని, వ్యక్తి గతంగా కాని

యే సమస్య వచ్చినా వాటికి పరిష్కారం మన రామాయణాది గ్రంథాల్లో లభిస్తుంది. ఆ గ్రంథమే మన నిధి నిక్షేపాలు. అందులోని సంఘటనలే మనకు దీపస్తంభాలు.

హనుమంతుడు జ్ఞాన సముపార్జన చేసినవాడు. అందుకు ఎంతో శ్రమపడ్డాడు. కష్టపడితేనే యేదైనా సాధించగలుగుతారు. సముపార్జించిన విద్య సద్వినియోగం కావాలి. సమాజగతం కావాలి. అందుకే తన శక్తినంతటినీ ధర్మ రక్షణా కార్యంలో సమర్పించుకున్నాడు. హనుమ రామభక్తుడు. కణకణంలోను రోమరోమంలోను రామతత్త్వమే నిండి ఉంది. అలా రామతత్త్వంతో మమేకం చెందినవాడు. అణువణువులో రాముడినే దర్శించుకున్నాడు. రాముడినే నమ్మి దాసుడైనాడు. బంటులా పనిచేశాడు. రామబంటుగా ప్రసిద్ధుడైనాడు. సీతారాముల విశ్వాసాన్ని చూరగొన్నాడు. అందుకే రాముడు తన అంగుళీయకాన్ని, సీతాదేవి తన చూడామణిని హనుమకే ఇచ్చారు. వ్యక్తిత్వము కార్యనిష్ఠ ద్వారా ఎదుటి వారి విశ్వాసాన్ని, నమ్మకాన్ని పొందుతుండాలి. జీవన పర్యంతం ఆ భక్తితోనే ఉన్నాడు హనుమ. మధ్యలో యెక్కడా మనసు చెదరలేదు. చంచలం కాలేదు. పూర్ణ విశ్వాసమంటే అదే.

హనుమంతుని తత్త్వాన్ని పూజిస్తున్నామంటే హనుమంతునిలా తయారు కావడమే. అంటే సర్వకార్యములను నిర్వహించే దక్షతగలిగిన వ్యక్తులుగా తయారు కావడమే. రామకార్యంలో, ధర్మ రక్షణా కార్యంలో హనుమంతుడు తన కర్తవ్యాన్ని ఆ విధంగానే నిర్వర్తించాడు. ప్రతి వ్యక్తి నేడు సమాజంలో అటువంటి భూమికను పోషించాలి. అప్పుడే సమాజం సురక్షితంగా ఉండగలుగుతుంది. హనుమంతుడు ఒక మంత్రిగా, సేనానాయకుడుగా, సలహాదారుడుగా, ఒక రాయబారిగా, మహాబలవంతుడుగా, వినయవంతుడుగా, సమయస్ఫూర్తిగలవాడుగా అడుగడుగునా కనిపిస్తుంటాడు.

హనుమ శక్తి సామర్థ్యాలను గురించి **ధృతి: దృష్టి: మతి ర్దక్షా** అని అన్నాడు వాల్మీకి. అంటే గొప్ప ధైర్యవంతుడు (కరేజ్), దృష్టి అంటే దూరదృష్టి (విజన్), మతి అంటే మంచి తెలివితేటలు (ఇంటెలిజెన్స్), దక్షా అంటే సామర్థ్యము, కార్యదక్షత (కపాసిటి) గలవాడని అర్థం. కార్యసాధకుడికుండవలసిన లక్షణాలివి. ప్రతి వ్యక్తి ఇష్టపడి సాధన చేసి యీ గుణాలను అలవరచుకోవాలి. నిత్య జీవితంలో ఎలా ఉండాలో అవగాహన కలుగుతుంది. ఆలోచన పెరుగుతుంది. దురాలోచన కాదు. అది దూరాలోచన. కార్యాచరణా సామర్థ్యం కూడ పెంపొందుతుంది. మనిషి సమర్థుడవుతాడు. అందుకే అందరికీ హనుమ ఆదర్శం.

హనుమంతుడు సుగ్రీవునకు మంత్రి. వాలిసుగ్రీవులు అన్నదమ్ములు. వాలిలో ఉన్న తొందరపాటు, అపార్థము, బల గర్వము, అహంకారము అతని చేత తప్పటడుగులు వేయించి తొందరపాటు నిర్ణయాలు తీసుకునేలా చేసింది. సుగ్రీవుడికి అన్యాయం చేశాడు. హనుమ అందుకే సుగ్రీవుని పక్షాన చేరి అడుగడుగునా మంత్రాంగం చేస్తూ తగు సలహాలిస్తూ వచ్చాడు. రామసుగ్రీవుల మధ్య స్నేహాన్ని కుదిరేలా వ్యవహరించాడు. స్నేహితులిద్దరూ పరస్పర సహకారం అందించుకోవడంలో కీలక పాత్ర పోషించాడు. మనిషి మనుషులను అనుసంధానం చేయాలి తప్ప విరోధాలను సృష్టించకూడదు. సముద్ర లంఘన సమయంలో మైనాకుడు అనే పర్వతుడు విశ్రాంతి తీసుకోమని ఆహ్వానించగా కార్యసిద్ధి జరిగే వరకు విశ్రాంతి లేదని తన కృత నిశ్చయాన్ని, పట్టుదల (డిటర్మినేషన్)ను చూపించాడు. సముద్రంలో సింహిక అనే ఛాయాగ్రహ లక్షణం కలిగిన రాక్షసి ఉంది. ఈ రాక్షసి హిరణ్య కశ్యపుని కుమార్తె. హనుమంతుడిని మ్రింగబోయింది. హనుమ సూక్ష్మబుద్ధి కలవాడు. వెంటనే సూక్ష్మరూపాన్ని ధరించి దాని పొట్టలో దూరి దాని పొట్టను చీల్చి బయటపడ్డాడు. అలాగే సురస అనే నాగమాత కూడ పెద్ద ఆకారమును ధరించి ప్రయాణమునకడ్డుపడగా హనుమ తన బుద్ధికుశలతతో అంగుష్ఠమాత్ర రూపాన్ని ధరించి సురస పొట్టలో దూరి వెంటనే బయటకు వచ్చితినని చెప్పగా

హనుమ మేధా శక్తిని సురస అభినందించి మార్గాన్ని సుగమం చేసింది. సముద్రాన్ని దాటి లంకకు చేరి లంకకు కాపలాకాయుచున్న లంకిణిని సంహరించి లంకలో ప్రవేశించి సీతను దర్శించాడు. ఈ కార్యనిర్వహణా క్రమంలో యెన్ని అడ్డంకులెదురైనా హనుమ నిర్భయంగా వ్యవహరించాడు. వెనుకంజ వేయలేదు. అడుగడుగునా సమస్యలను పరిష్కరించుకుంటూ ముందుకెళ్ళాడు. "న నిశ్చితార్థా ద్విర మంతి ధీరా:" అని గదా! ధీరులు తాము నిర్ణయించుకున్న కార్యము పూర్తయ్యేవరకు వెనుదిరుగరు గదా! అలాగే ప్రతి వ్యక్తి హనుమను ఆదర్శంగా తీసుకొని హనుమలా తయారుగావాలి.

చూసి రమ్మంటే కాల్చి వచ్చాడు అనే లోకోక్తి చాలా ప్రసిద్ధము. హనుమ లంకకు వెళ్ళి సీతను చూసి తరువాత లంకంతా కలయదిరిగి రావణాసురుని బలగము, ఆయుధాగారాలు, సైనిక శక్తి వీటినంతటినీ కూడ చూసి అంచనా వేసుకున్నాడు. రాముడి శక్తి యేమిటో కేవలం రుచి చూపిద్దామని చూసిరమ్మంటే కాల్చి వచ్చాడు. ఇదీ, ఒక బుద్ధికుశలత కలిగిన ఒక వ్యక్తి కుండవలసిన కార్యదక్షత. స్థలము, సందర్భాలను బట్టి కార్యములను నిర్వహించుకురావాలి. ఆపరేషన్ సిందూర్ అలాంటిదే.

కిష్కింధకు తిరిగి వచ్చి రాముని సన్నిధిలో జరిగిన కథంతా చెప్పడం మొదలు పెట్టక ముందుగా "దృష్టా సీతా" అని వెళ్ళిన పని యొక్క ఫలితాన్ని ఒక మాటలో చెప్పి ఆ తరువాత వివరంగా చెప్పాడు. ఇదీ హనుమ వాక్నైపుణ్యము (కమ్యూనికేషన్ స్కిల్) ఎంత మాట్లాడాలో ఎంత చెప్పాలో అంత వరకే సంభాషించడం ఒక గొప్ప లక్షణం. అధిక ప్రసంగి కాకూడదు. అస్పష్ట ప్రసంగి కాకూడదు.

అలాగే విభీషణుడు శ్రీరాముని శరణు కోరినప్పుడు హనుమ ఒక సేనా నాయకుడుగా సముచితమైన అభిప్రాయాన్ని చెప్పి తన సైనిక బలాన్ని పటష్ఠ పరచు కోవడం, లక్ష్మణుడు యుద్ధభూమిలో మూర్ఛపోయినపుడు సంజీవని ఔషధికోసం వెళ్ళి దానిని గుర్తించలేక పోవడంతో శూన్య హస్తములతో తిరిగి వెళ్ళకుండా నిర్ణీతసమయంలో ఔషధితో చేరుకొని లక్ష్మణుని రక్షించుకోవాలి కాబట్టి సమయస్ఫూర్తితో సంజీవని ఓషధి ఉన్న (ద్రోణ పర్వతాన్నే) పెకలించి నిశ్చిత సమయంలో చేరుకొని లక్ష్మణుని ప్రాణములను రక్షించిన ఘనత హనుమకే దక్కుతుంది. ఇది హనుమంతుని కార్యసామర్థ్యము, సమర్థతతో నిర్వహిస్తుండటం వలననే సత్ఫలితం కలుగుతూ వచ్చింది.

ఈ ఆధునిక యుగంలో ప్రతి వ్యక్తి సద్గుణాలను అలవరచుకోవాలి. పెంపొందించుకోవాలి. అలాగే కార్యనిర్వహణకు కావలసిన గుణాలను సమకూర్చుకుంటూ సామర్థ్యాన్ని పెంపొందించుకొని కార్యదక్షుడుగా తయారు కావాలి. ★



**నారాయణపేట:–** నారాయణపేట జిల్లా కేంద్రంలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ రామాలయం ప్రాథమిక పాఠశాల నూతన భవన ప్రారంభోత్సవంలో పాల్గొన్న విద్యాభారతి దక్షిణ మధ్య క్షేత్ర సంఘటనా కార్యదర్శి లింగం సుధాకర్ రెడ్డి. ★

**సరస్వతీ నగర్:–** సరస్వతీ నగర్, సైదాబాద్ శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఘన విజయం సాధించారు. పాఠశాల పేరును జాతీయ స్థాయికి తీసుకెళ్లారు. శిక్షాగగన్ చౌరవ కింద ఇస్రో నిర్వహించిన **"అంతరిక్ష విజ్ఞానం, సాంకేతికత మరియు అనువర్తనాల అవలోకనం"** కార్యక్రమాన్ని విజయ వంతంగా పూర్తి చేశారు. అంతరిక్ష విజ్ఞాన రంగంలో అతని అంకితభావం మరియు జిజ్ఞాసను గుర్తించి, ఇస్రో అతనికి ఒక ప్రతిష్ఠాత్మక ధృవపత్రాన్ని ప్రదానం చేసింది. ఇందులో అమిర్నేని దేవాన్ష్ శ్రీచరణ్, యశ్వంత్, మహేశ్వర్, పూజిత వున్నారు. వీరందరికీ స్ఫూర్తి పత్రిక పక్షాన శుభాభినందనలు. ★

## శిశుమందిర్ విద్యార్థులకు మంచి అవకాశం

**మ**న స్ఫూర్తి పత్రికలో మంచి మంచి వ్యాసాలు వస్తున్నాయి. ముఖ్యంగా సైన్సు పేజీ, లోకజ్ఞానం పేజీలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటున్నారనుకుంటున్నాను. అయితే విద్యార్థులలో సృజనాత్మకత శక్తిని, ఊహాశక్తిని పెంపొందించడం కోసం దానికి అక్షర రూపాన్నిచ్చే అవకాశమివ్వాలని స్ఫూర్తి ఆలోచన చేసింది. శిశుమందిరాలలో చదివే విద్యార్థులు తెలుగులో వచన, పద్య లేదా గేయ కవిత్వాన్ని వ్రాసి పంపవచ్చు. విలువలతో కూడిన మంచి కథలను వ్రాసి పంపవచ్చు. ఇతరుల రచనలను కాని, ఇతర పత్రికలలో వచ్చినవి కాని రచయితల పేరు మార్చి పంపకూడదు. తప్పని సరిగా సొంత రచన అయి ఉండాలి. సామాజిక అంశాలపై వ్యాసం కూడ వ్రాసి పంపవచ్చు. జల వినియోగం, విద్యుద్వినియోగం, పర్యావరణం వంటి విషయాలను ఇతి వృత్తంగా తీసుకోవచ్చు. ఆలోచించిన కొలది మంచి భావాలు వస్తుంటాయి. సమయాన్ని వృథా చేయకుండా మీ ఆలోచనలకు అక్షర రూపం కల్పించండి. మీలో ఉన్న రచనాశక్తిని వికసింప చేసుకోండి. ఎంపికైన రచనలను స్ఫూర్తి పత్రికలో ముద్రించగలుగుతాము. సంవత్సరాంతంలో ఉత్తమ రచనకు పారితోషికమివ్వబడుతుంది.

విద్యార్థుల నుండి కథలు, వ్యాసాలు, గేయాలు, పాటలు, పద్యాలు, వచన కవితలు, మినీ కవితల వంటివి ఆహ్వానింపబడుతున్నాయి. ప్రచురించే హక్కు పూర్తిగా సంపాదకునిదే మీ భావాలకు, ఆలోచనలకు అక్షర రూపాన్నివ్వండి. స్ఫూర్తి Mail ID: sphoortissvp@gmail.com

– సంపాదకుడు

## శిశుమందిర్ ఆచార్యులకు విజ్ఞప్తి

**మీ**రు ఏ విషయాన్నైనా బోధించవచ్చు. మీలో ఒక కవి, రచయిత ఉన్నాడనే విషయాన్ని జ్ఞాపకం పెట్టుకోండి. మీలో ఉన్న రచయితను మేల్కొలపండి. మనకు స్ఫూర్తి పత్రిక వెలువడుతుందన్న విషయం మీకు తెలుసు. మీ ఆలోచనలకు పదును పెట్టండి. మెదడు కింత మేత వెయ్యండి. కలాన్ని విద్యార్థులకు, తల్లిదండ్రులకు సమాజానికి ఉపయోగ పడే రచనలు చేసే దిశగా కదిలించండి. మీరు అడుగులు వేయండి.

కవితలు, పద్యాలు, పాటలు, గేయాలు, లేదా విద్యారంగానికి సంబంధించిన ఉదాహరణకు బోధనా నైపుణ్యాలు, వాఙ్నైపుణ్యాలకు సంబంధించిన విషయాలేవైనా వ్రాసి స్ఫూర్తి Mail ID: sphoortissvp@gmail.com కి పంపించండి. ఉత్తమమైన వాటిని ఎంపిక చేసి స్ఫూర్తిలో ముద్రించగలుగుతాము. సొంత రచనలై ఉండాలి సుమా! మంచి రచనకు పారితోషిక మివ్వబడుతుంది.

సమాయాన్ని వృథా చేయకుండా మంచి ఆలోచనలతో భావాలతో మనస్సును నింపితే సృజనాత్మకత కలుగుతుంది. మీ ఆలోచనలను అక్షరబద్ధం చేయండి. మంచి మంచి రచనలు చేయగలుగుతారు. వెంటనే యీ ప్రయత్నానికి శ్రీకారం చుట్టండి. వచ్చే సంచిక నుండే యిది ప్రారంభమౌతుంది.

ప్రచురించే హక్కు పూర్తిగా సంపాదకునిదే. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసిందిగా విజ్ఞప్తి. కవి రాసే ఒక్క సిరాచుక్క లక్ష మెదళ్ళకు కదలిక.

– సంపాదకుడు

పద్యం-పరమార్థం

# పద్యంలో పరమ వైభవం



✍ ఆచార్య కసిరెడ్డి వేంకటరెడ్డి

**వం**దేమాతర గీతం జాతీయోద్యమానికి ప్రేరణనిచ్చింది. భారతమాత వైభవాన్ని సాక్షాత్కరింప జేసింది. వేదమాత, గోమాత, గంగామాత, గీతామాత అనే విధంగా భారతీయుల్లో పవిత్ర భావాలు నిర్మాణం చేసింది.

ఆ వందేమాతర ప్రభావంతోనే తెలుగులో రాయప్రోలు వారి ఏదేశమేగినా ఎందు కాలిడినా, శ్రీలు పొంగిన జీవగడ్డయి, గురజాడ వారి – దేశమును ప్రేమించుమన్నా, మంగిపూడి వెంకట శర్మ గారి – మేలుకొనుమా భారత పుత్రుడ, దేవులపల్లి వారి – జయ జయ జయ ప్రియ భారత జనయిత్రీ, దువ్వూరి వారి – జోహార్ జోహార్ భారతమాత, రాఘవశర్మ గారి – జయ జయ భారత జననీ, మల్లాది రామచంద్రశాస్త్రి గారి – జయ జయ జయ భారత జనయిత్రీ, కొండపల్లి జగన్నాథదాసు గారి–భారతమాత పిలుపు వినమన్నా... ఇలా ఇలా ఎన్నో గేయకవితలు వచ్చినై. ఇవన్నీ ఇలాంటివి ఇంకా పూర్తిగా చదువాలనుకొన్నవారు శ్రీ గురజాడ రాఘవశర్మ గారు సంకలనం చేసిన జాతీయగీతాలు చూడండి! రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రచురించిన విజయ విపంచి సంచికలు చూడండి!

నమో హిందు మాతా! మాతా! సుజాత! నమో! జగన్మాతా! అని కీర్తించిన కవులున్నారు. జనగణమన వ్రాసిన విశ్వకవికీ ప్రేరణనిచ్చింది, బంకింగారి వందేమాతరమే! భారత స్వాతంత్ర్యసిద్ధికై మహామంత్రమయింది వందేమాతరమే!

ఆ ప్రభావంతో వందేమాతర కావ్యమే వచ్చింది. కోకొల్లలుగా ఖండ కావ్యాలు వచ్చినై. వేలకొలది పద్యాలు వచ్చినై. అందులో పృథ్వీసూక్తమ్, అగ్నిమూర్తులు వంటి ఖండకావ్యాలు వ్రాసిన మహానుభావులు జాతీయ సాహిత్య పరిషత్ వ్యవస్థాపకులు శ్రీ భండారు సదాశివరావు గారు ఎందరికో మార్గదర్శకులుగా నిలిచారు.

ఇది నా దేశము, వీరు సోదరులు .... అనే వారి పద్యం జాతీయవాదులకు ప్రార్థనా పద్యంగా ప్రచారంలో ఉంది. అదే విధంగా ఈ కాశ్యపీఖండ మెవనిదా! అన్న ఈ పద్యం వీర భారతులకాహ్వానం పలుకుతుంది.

**సీ॥ ఈ కాశ్యపీఖండ మెవనిదా? యెవడు స్వ**<br>
**త్వ స్థైర్య ఖనియో అవ్వాని దవుట,**<br>
**దేవ దుర్లభమైన ఈ వసుధ యెవని**<br>
**దా! మగటిమిగల స్వామిదవుట,**<br>
**ఈ రత్నగర్భకు నెవడు ప్రభుండని**<br>
**య! యెవడు దక్షుడో అతడె యగుట,**<br>
**ఈ నేలనేలగ నెంచనర్హత మెవ**<br>
**నిద? వీర సంపద ఆదియు నగుట,**<br>
**కాల సాక్షి యెరుంగు న ఖండ శస్త్ర**<br>
**కౌశల శ్రీగలట్టి విక్రమ మెరుంగు!**<br>
**ఎరుగు రాఘవు కోదండ, మెరుగు సవ్య**<br>
**సాచి గాండీవ నారీ ప్రసార రవము.**

ఈ పద్యం ప్రశ్నలతో–సమాధానాలతో నడచింది. భారతీయ జనగణ శక్తి యిటువంటిదని నిరూపించింది.

అలనాటి మహర్షి కశ్యపుని పేరిట వెలసిన ఈ భారత దేశం ఎవరిది? అంటే ధైర్యస్థైర్యాలు నిండుగా దండిగా ఉన్నవారిదే అని గ్రహించాలి.

దేవతలకు కూడా లభించని దివ్యమైన ఈ ధాత్రి ఎవరిది? అంటే పరాక్రమమున్న ప్రభువుదే అని తెలుసుకోవాలి.

రత్నాలు గర్భంలో నిక్షిప్తమై ఉన్న ఈ ధరణి ఎవరిదా అని అంటే ఎవరు సమర్థులో వారిదే అన్నది గుర్తించాలి.

ఈ భూమిని పరిపాలించే అధికారం–యోగ్యత ఎవరికున్నది అని అంటె ఎవరు వీరులో వారికే ఆ అర్హత ఉన్నదని స్థిరీకరించుకోవాలి.

ఈ దేశం ఇన్ని ఎదురుదెబ్బలు తిని నిలబడడానికి కారణం ఆయుధ నైపుణ్య సంపదలు ప్రదర్శించిన పరాక్రమానికి తెలుసు; ఈ విషయానికి కాలమే సాక్షి; ఆ కాలానికి సంగతి తెలుసు; అంతేకాదు శ్రీరామచంద్రుని కోదండానికీ సంగతి తెలుసు; అర్జునుని గాండీవం యొక్క వింటి ధ్వనికీ సంగతి తెలుసు.

ఇలా ఈ పద్యం హైందవ జాతి పరాక్రమాన్ని ప్రదర్శిస్తూ చదివేవారి భుజాలుప్పొంగే విధంగా చేస్తున్నది. సత్త్వస్థైర్యఖనులు కావాలి; మగటిమిగల వ్యక్తులుగా నిలబడాలి. దక్షులై కొనసాగాలి. వీరత్వమనే సంపదతో వెలగాలి.

ఈ దేశంమీద అలెగ్జాండర్, మహ్మద్‌బిన్ కాశీం, ఘోరి, గజనీ, చెంగిజ్‌ఖాన్ దాడులు చేశారు. గుళ్ళూ-బళ్లూ కూల్చారు. గ్రంథాలయాలు కాల్చారు.

ఇక బ్రిటీషు క్రైస్తవ పాలకులు దోచినదంతా తమ దేశానికి పంపించుకున్నారు. హిందూ సమాజంలో కులబేధాలు సృష్టించే చరిత్ర వ్రాశారు. మెకాలే విద్యావిధానంతో భారతీయ విద్యను భ్రష్టు పట్టించారు.

ఇక వీళ్లకు తోడుగా ఈ దేశ ప్రాచీన వైభవాన్ని సంస్కృతిని, వక్రీకరించి, రష్యా-చైనాల తొత్తులు తమ రాజ్యం ఇక్కడ నెలకొల్పాలనే ఉద్దేశంతో విషబీజాలు నాటారు.

ఇన్నిటిని తట్టుకొని నిలబడి తమ జన్మభూమి - కర్మభూమి - పుణ్యభూమి అయిన ఈ హిందూధాత్రిని రక్షించుకొనే శక్తి ఉందని, అందరిలో ప్రస్థాపించే భావనాశక్తిని అందించిందీ పద్యం.

**భరతజాతి సత్త్వమ్మును**
**పరీ క్షించబోకుము**
**అది సహనానికి యేలిక**
**సమరానికి కాళిక ....** అన్న కవివర్యులు సినారె గారి గేయ కవితకు వ్యాఖ్యాన ప్రాయంగా నిలిచిన శ్రీ సదాశివరావు గారి ఈ పద్యాన్ని - పద్య పరమార్థాన్ని జీవితంలో సాకారం చేసుకొందాం ! దేశ పరమ వైభవం దిశగా పయనిద్దాం !! ★

## పూర్వ విద్యార్థుల సమావేశము



**రాంపూర్:**-శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయం చొక్కారాంనగర్, రాంపూర్ - 2001 సంవత్సరంలో పూర్తి చేసిన పూర్వ విద్యార్థుల బ్యాచ్ తమ 25 సంవత్సరాల సందర్భంగా ఆనందోత్సాహాలతో సమావేశమై వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంలో పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ, తమ విద్యాలయంతో ఉన్న అనుబంధాన్ని మరోసారి గుర్తుచేసుకున్నారు.

ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఒకరినొకరు కలుసుకుని అనుభవాలను పంచుకున్నారు. గురువులను స్మరించుకుంటూ, వారి మార్గదర్శకానికి కృతజ్ఞతలు తెలిపారు. కొంతమంది ఉపాధ్యాయులను ఆహ్వానించి సన్మానించడం ద్వారా తమ కృతజ్ఞతను వ్యక్తపరిచారు. అలాగే, సమాజ సేవా కార్యక్రమాలకు తోడ్పడాలని నిర్ణయించుకుని, భవిష్యత్తులో పాఠశాల అభివృద్ధికి సహకరించాలనే సంకల్పాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం ఎంతో ఆత్మీయంగా, సంతోషకర వాతావరణంలో జరిగింది. ★

## శ్రీ కాశీపురం ప్రభాకర రెడ్డికి అభినందనలు

**శ్రీ శారదాధామము:-** శ్రీ సరస్వతీ విద్యా పీఠము ప్రాంత సేవా విభాగము శ్రేయోభిలాషులు, ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ - సామాజిక కార్యకర్త శ్రీ కాశీపురం ప్రభాకర రెడ్డి. వీరు స్విమ్మింగ్ పోటీలో రెండు రాష్ట్రాల చాంపియన్‌షిప్ లో 4 స్వర్ణాలు సాధించారు. వారు స్విమ్మింగ్ పోటీలో స్వర్ణపతకము సాధించిన సందర్భంగా వారికి శుభాభి నందనలు. ఇంకా అనేక స్వర్ణ పతకాలు సాధించాలని శ్రీ సరస్వతీ విద్యా పీఠము ప్రాంత సేవా విభాగము ఆకాంక్షిస్తుంది. ★

విజ్ఞానం

# పోతన భాగవతము
## వైజ్ఞానిక అంశాలు

✍ ఉపద్రష్ట లక్ష్మణసూరి



## రెండవ స్కంధం

రెండవ స్కంధంలో 32 వ వచనంలో ప్రకృతికి ఆధారమైన (five elements) గగనం, వాయువు, తేజస్సు, జలం, పృధ్వి, పంచభూతాలను దేహంగా 14 భువనాల స్వరూపమైన విరాట్ రూపంగా వివరించారు. ఈ విశ్వసృష్టికి కారణమైన శక్తి అణు రూపంలో ఉందా అనే ప్రశ్నతో ప్రారంభించి ఈ జగత్తు యొక్క సృష్టిని ప్రారంభించే విజ్ఞానం ఏది? విశ్వమంతటా వ్యాపించిన మహా స్వరూపుడు ఏ శక్తి లో ఉంది. నారదుడు బ్రహ్మను ప్రపంచం ఏ విధంగా సృష్టించబడింది? ఈ విశ్వ సృష్టి జరిగిన వర్ణన ఆధునిక కాస్మాలజిస్టులు చెప్పే విశ్వవిస్తరణ, విశ్వ నిర్మితి, పరిణామ వాదం (evolutionary theory) యధాస్థితి వాదం (study state theory) మహావిస్ఫోట సిద్ధాంతంలో (Big Bang theory) పోలి ఉన్నాయి. పోతన రెండవ స్కంధంలో 73 నుండి 91 వరకు వివరించిన పద్య గద్యాలను పరిశీలిస్తే మన పూర్వులు కాలాన్ని యుగాలుగా, మహాయుగాలుగా, కల్పాలుగా విభజించి సృష్టి, స్థితి, లయం తిరిగి సృష్టి చక్ర నేమి క్రమంలో జరుగుతాయని ఊహించారు. ఆది అంతం లేకుండా విశ్వవిస్తరణ విశ్వము వలన జరుగుతాయని ఆధునిక శాస్త్రవేత్తలు విశ్వ స్పందన సిద్ధాంతం (pulsation theory of universe)తో చెప్పిన విషయంతో పోలిక ఉంది.

రెండవ స్కంధంలోని 90వ పద్యం నేటి సూర్య కేంద్ర సిద్ధాంతం (heliocentric theory)తో పోలిక ఉంది. సౌర కుటుంబంలో సూర్యుడు కేంద్రంగా అన్ని గ్రహాలు తిరుగుతూ ఉంటాయని చెప్పారు

రెండవ స్కంధంలో 141వ పద్యం నుండి 198 వరకు శ్రీమన్నారాయణుని లీలావతారంబుల అభివర్ణనము అనే అధ్యాయంలో భగవంతుడు ధర్మసంస్థాపన కొరకు జలచరం మత్స్యావతారం నుండి పరిపూర్ణ మానవుడు కల్కి అవతారం వరకు క్రమంగా అవతరించాడని భాగవతం చెప్పిన విధానం చార్లెస్ డార్విన్ చెప్పిన థియరీ ఆఫ్ ఎవల్యూషన్ జీవ పరిణామ (theory of evolution) క్రమంతో పోలి ఉంది.

**బాహ్యాభ్యంతరంబులం గలుగు బ్రహ్మాండ ప్రమాణం బెంత ?
భూ పాతాళ, కకుబ్ వ్యోమ గ్రహ నక్షత్ర పర్వతంబులుసు
గురి త్సముద్రంబులును ద్వీపంబులును నేప్రకారంబున
సంభవించే? (2-222)**

222 లో భూమి పాతాళం దిక్కులు, ఆకాశం గ్రహాలు నక్షత్రాలు పర్వతాలు నదులు సముద్రాలు దీవులు ఎలా ఉద్భవించాయి? బ్రహ్మాండం కొలత ఎంత మహా కాలాన్ని, సూక్ష్మ కాలాన్ని ఎలా కొలవాలి? ఈ విశ్వం సృష్టింపబడక ముందు ఏమి ఉండేది ఇలాంటి ప్రశ్నలతో పోతన విశ్వసృష్టికి ఆధారమైన ఎన్నో విషయాలను సహేతుకంగా ప్రశ్నించాడు.

## మూడవ స్కంధం

మహాభాగవతంలో మూడవ స్కంధములో మైత్రేయుడు అణు, పరమాణువు సిద్ధాంతాన్ని సూక్ష్మకాలం నుండి మహత్కాలం వరకు కాల విభజనను విదురునకు విశదీకరించిన వర్ణన, 18వ శతాబ్దంలో డాల్టన్ అటామిక్ థియరీతో పోలిక ఉంటుంది. ఈ వర్ణన ఖగోళశాస్త్రంలోని చంద్రగమనం, గ్రహగమనాలు, సూర్యగమనం, రాశి చక్రాలు లాంటి ఎన్నో నేటి వైజ్ఞానిక అంశాలతో పోలి ఉంది.

భారతీయ జ్ఞాన పరంపరను తెలుగు సాహిత్యంలో సీసము, తేటగీతి, వచన ప్రక్రియల ద్వారా తెలియచెప్పిన ఏకైక కవిగా బమ్మెర పోతన ఎప్పుడు మన మదిలో నిలిచిపోతారు. ఆంధ్ర మహాభాగవతం భక్తి గ్రంధమే కాక వైజ్ఞానికంగా కాలాన్ని లెక్కించిన మార్గదర్శిగా తెలుగు సాహిత్య వైజ్ఞానిక సౌరభాలను అందరికీ పంచుతోంది.

అని మైత్రేయుడు విదురునితో పలికి కాలస్వభావం

వివరించాలనుకున్నవాడై ఈ విధంగా అన్నాడు.

**సీ॥ భువిఁ దనకార్యాంశమునకు నంతము**
**నన్య వస్తుయోగంబు నేవలన లేక**
**ఘటపటాదిక జగత్కార్యంబునకు నిజ**
**సమవాయ కారణత్వమునఁ బరఁగి**
**జాలసూర్య మరీచి సంగతగగనస్థ మగు**
**త్రసరేణు షడంశమరయఁ**
**బరమాణు వయ్యెఁ; దత్పరమాణువం దర్క**
**గతి యెంత తడవు దత్కాల మగును**

**తే॥ సూక్ష్మకాలంబు; విను మది సూర్యమండ,**
**లంబు ద్వాదశరాశ్యాత్మకం బనంగఁ**
**గలుగు జగమున నొక యేఁడు గడచి చనినఁ,**
**గాల మెంతగు నది మహత్కాల మనఘ!**

భగవంతుని సృష్టికార్యానికి అంతు అనేది లేదు. దానికి వేరే వస్తువులతో సంయోగం కూడా అవసరం లేదు. జగత్తులో కుండలు-బట్టలు తయారయ్యే తీరు ఒకటి - సృష్టికార్యం మరియొకటి. కుండ ఈ లోకంలో తయారు కావాలంటే (1) మట్టి (ఉపాదానకారణం) (2) మట్టిని కుండగా రూపొందించటం (సమవాయ కారణం) (3) కుండను చేసేవాడు (నిమిత్త కారణం) అవసరం. అట్లే పట నిర్మాణం. ప్రత్తి- ఉపాదానం; దారాలు, నేత- సమవాయి: వస్త్ర నిర్మాత- నిమిత్తం. లోకంలో ఏ కార్యానికైనా పై మూడు అవసరం) భగవత్ సృష్టిలో భగవంతుడు సమవాయ కారణం కూడా అవుతాడు.

(ఇక సృష్టిని ముక్కలు ముక్కలుగా ప్రస్తరిస్తే ఏర్పడే సూక్ష్మాతి సూక్ష్మాంశానికే "పరమాణువు" అని పేరు) సూర్యుని కాంతి కిటికీలో నుండి ప్రసరించేటప్పుడు మన కంటికి కనిపించే చిన్న చిన్న రేణువులలో ఆరవభాగానికి "పరమాణువు" అని పేరు. అ పరమాణువుపై ఒక ప్రక్క నుండి మరియొక ప్రక్కకు సూర్యకిరణం పయనించే కాలానికి "సూక్ష్మ కాలం" అని పేరు. (సూక్ష్మ కాలాన్ని కేవలం ఊహించుకోవలసిందే, అది మిక్కిలి అత్యల్పమైన కాలపరిమాణం) సూర్యుడు మేషం మొదలైన పన్నెండు రాశులలో పయనించే కాల పరిమాణం పేరు మహత్కాలం (దీనికే సంవత్సరం అని పేరు, మహత్కాలానికీ-సూక్ష్మకాలానికీ మధ్యనున్న వివిధ కాల పరిమాణాలు మునుముందు వివరింపబడుతాయి.)

**వ॥ అందుఁ బరమాణు ద్వయంబొక్క "యణు" వగు;**
**నణుత్రితయం బొక్క "త్రసరేణు" నగు; నవి**
**మూఁడు గూడ నొక్క "త్రుటి" యగు; నాత్రుటిశతం బొక్క**
**"వేధ" యనంబరఁగు; నట్టి వేధలు**
**మూఁడు గూడ నొక్క "లవం" బనదగు; నవి మూఁడైన**
**నొక్క "నిమేషం" బనంజను; నిమేషత్రయం**
**బొక్క "క్షణం బగు; తత్క్షణ పంచకం బొక్క "కాష్ట" యనం**
**దగు నవి పదియై నొక్క "లఘు" వన**
**నొప్పు; నట్టి లఘుపంచ దశకంబొక్క "నాడి" యవంబరఁగు:**
**నట్టి నాడికాద్వయం బొక్క "ముహూర్తం"**
**బయ్యెఁ; నట్టి నాడిక లాఱైన -నేడైన- మనుష్యులకు నొక**
**"ప్రహరం" బగు; నదియు "యామం" బనంజను;**
**దివసపరిమాణ విజ్ఞేయంబు వాడికోన్మాన లక్షణం**
**బెఱింగింతు వినుము; షట్పల తామ్రంబునం**
**బాత్రంబు రచియించి చతుర్మాష సువర్ణంబునం**
**జతురంగుళాయామశలాకంబుఁ గల్పించి దానం**
**దత్పాత్రమూలంబున ఛిద్రంబుఁ గల్పించి తచ్ఛిద్రంబునం**
**బ్రస్థమాత్ర తోయంబు పరిపూర్ణంబు**
**నొందువంత కాలం బొక్క "నాడిక" యగు; యామంబులు**
**నాలుగు సన నొక్క "పగ" లగు; రాత్రియు**
**నిప్పగిది జరగు;నట్టి యహర్నిశంబులు గూడ మర్త్యుల**
**కొక దివసం" బగు; నవి పదునేనైన నొక్క**
**"పక్షం" బగు; శుక్ల కృష్ణ నామంబులం బరఁగిన య**
**ప్పక్షంబులు రెండుగూడ నొక్క 'మాసం' బగు;**
**నది పితృదేవతలకు నొక్క "దివసం" బగు; నట్టి మాసంబులు**
**రెండైన నొక్క "ఋతు" వగు; షణ్మాసంబు**
**లరిగిన నొక్క 'యయనం' బగు; దక్షిణోత్తర నామంబులం**
**బరఁగినట్టి యయనంబులు రెండుగూడి**
**ద్వాదశ మాసంబులైన నొక్క "సంవత్సరం" బగు; నట్టి**
**సంవత్సరశతంబు నరులకుం బరమాయు**
**వైయుండుఁ; గాలాత్ముందును నీశ్వరుందునునైన సూర్యుందు**
**గ్రహ నక్షత్ర తారా చక్రస్థుండై**

**పరమాణ్వాది సంవత్సరాంతంబైన కాలంబునం జేసి ద్వాదశరా శ్యాత్మకంబైన జగంబున సౌర బార్హస్పత్య సావన చాంద్ర నాక్షత్ర మాన భేదంబులం గానంబడు చున్నవాఁడై సంవత్సర పరీవత్స రేదావత్స రామవత్సర వత్సర నామంబుల సృజ్యంబైన బీజాంకురంబుల శక్తిం గాలరూపంబైన స్వశక్తిచేత నభిముఖంబుగాఁ జేయుచుఁ బురుషులకు నాయురాది వ్యయంబులం జేసి విషయాసక్తి నివర్తింపం జేయుచుం గోరికలు గల వారికి యజ్ఞ ముఖంబులం జేసి గుణమయంబులైన స్వర్గాది ఫలంబుల విస్తరింపజేయుచు, గగనంబునఁ బరువువెట్టు. వత్సరపంచక ప్రవర్తకుండగు మార్తాండునకుం బూజ గావింపు మని మైత్రేయుండు పలికిన విదురుం డిట్లనియె.**

రెండు పరమాణువులు ఒక "అణువు". మూడు అణువులు ఒక "త్రసరేణువు". మూడు సరేణువులు ఒక "త్రుటి". నూరుత్రుటులు "వేధ". మూడు వేధలు ఒక "లవం". మూడు అవాలు ఒక మేషం", మూడు నిమేషాలు ఒక్క "క్షణం". ఐదు క్షణాలు ఒక "కాష్ఠ". పది కావలు ఒక "లఘువు". పదునైదు లఘువులు ఒక "నాడి". రెండు నాడులు ఒక ముహూర్తం. అట్టి నాడులు ఆరు కానీ ఏడు కానీ అయినచో మనుష్యనకు ఒక "ప్రహరం" అవుతుంది. దానినే "యామ" మనీ లేక "జాము" అని అంటారు.

దిన పరిమాణాన్ని తెలిపే నాడిని కొలిచే విధానం చెబుతాను విను. ఆరు పలాల రాగితో పాత్ర సిద్ధంచేసి, నాల్గు మినుగింజల బరువు గల బంగారుతో నాలుగు అంగుళాల పొడవైన కమ్మీ తయారుచేసి, దానితో ఆ పాత్ర క్రింద రంధ్రం చేస్తే, ఆ రంధ్రగుండా తూమెడు నీరు పూర్తిగా క్రిందకు కారడానికి ఎంత కాలం పడుతుందో కాలాన్ని ఒక "నాడి" అంటారు.

నాలుగు జాములు ఒక "పగ" లవుతుంది. అదే విధంగా నాలుగు జాములు ఒక "రాత్రి" అవుతుంది. పగలు రాత్రి కలిస్తే మానవులకు ఒక "దినం" పదునైదు దినాలు ఒక "పక్షం". శుక్ల పక్షం, కృష్ణ పక్షం అని పక్షాలు రెండు. ఈ రెండు పక్షాలూ కూడి ఒక "నెల". అది పితృదేవతలకు ఒక "దినం".

రెండు నెలలు ఒక "ఋతువు". ఆరు నెలలు ఒక "అయనం". దక్షిణాయనం, ఉత్తరాయణం అని అయనాలు రెండు. ఈ రెండూ కలసిన పండ్రెండు నెలలు ఒక "సంవత్సరం". ఈ సంవత్సరం దేవతలకు ఒక్క దినం అవుతుంది. నూరు సంవత్సరాలు మానవులకు పరమాయువు.

కాలమే ఆత్మగా గల సూర్యభగవానుడు గ్రహాలతో నక్షత్రాలతో కూడిన తారాచక్రంలో ఉన్నవాడై పరమాణువు మొదలుకొని సంవత్సర పర్యంతమైన కాలంలో పండ్రెండు రాశులను చుట్టివస్తాడు. ఈవిధమైన సూర్యగమనం వల్ల సౌరమానము, చాంద్రమానము, నక్షత్రమానము అనే భేదాలతో సంవత్సరకాలం ఏర్పడుతుంది. ఇది సంవత్సరం పరీవత్సరం, ఇడావత్సరం.

మూడవ స్కంధములో కపిలుడు దేవహూతికి తల్లి గర్భంలో పిండ ఉత్పత్తి క్రమాన్ని సీసము, తేటగీతి, వచనంతో వివరించిన వర్ణన నేటి ఆధునిక పిండ ఉత్పత్తి శాస్త్రము (medical embryology) తో ఖచ్చితంగా పోలి ఉండడం చాలా ఆశ్చర్యకరమైన విషయం.

**-: కపిలుండు దేవహూతికిఁ బిండోత్పత్తి క్రమంబుఁ దెలుపుట :-**

సీ॥ కైకొని మణి పూర్వకర్మానుగుణమున
శశ్వత్ప్రకాశకుం డీశ్వరుండు
ఘటకుండు గావునఁ గ్రమ్మఱ జీవుండు
దేహసంబంధంబుఁ దీవిరి తాల్ప
దొరకొని పురుష రేతోబిందు సంబంధి యై
వధూగర్భంబునందుఁ జొచ్చి
కైకొని యొక రాత్రి గలిలంబు పంచరాత్రములు
బుద్బుదమును దశమదివస

తే॥ మందుఁ గర్కంధు వంతయౌ నంతమీఁదఁ,
బేశియగు నంతమీఁదటఁ బేర్చి యుండ
కల్పమగు నొక్క నెల మస్తకమును మాస,
యమళ మైనను గరచరణములుఁ బొడము.

'ఈశ్వరుడు శాశ్వతంగా ప్రకాశించేవాడు, సర్వమూ, సంఘటిత పరచేవాడు, కాబట్టి జీవుడు తన పూర్వకర్మలను

అనుసరించి మళ్ళీ దేహాన్ని పొందగోరుతాడు. జీవుడు పురుషుని వీర్యబిందు సంబంధంతో స్త్రీ గర్భంలో ప్రవేశిస్తాడు. ఒక్క రాత్రికి కలిలమై (శుక్రశోణితాల ద్రవమై), తర్వాత ఐదురాత్రులకు బుద్బుదమై, ఆపైన పదవదినానికి రేగుపండంతయై అనంతరం మాంసపిండమై గ్రుడ్డు ఆకారం పొందుతాడు. ఒక్క నెలకు శిరస్సు ఏర్పడుతుంది. రెండు నెలలకు కాళ్లుచేతులు వస్తాయి.

వ॥ మఱియు మాసత్రయంబున నఖ రోమాస్థి చర్మంబులు
లింగచ్ఛిద్రంబులును గలిగి నాల్గవమాసంబున
సప్త ధాతువులును బంచమ మాసంబున క్షుత్తృష్ణలును
గలిగి, షష్ఠమాసంబున మావిచేతం బొదువంబడి
తల్లికుక్షిని దక్షిణ భాగంబునం దిరుగుచు, మాతృభుక్తాన్న
పానంబులవలనఁ దృప్తిం బొందుచు
నేధమాన ధాతువులు గల్గి జంతుసంకీర్ణంబగు విణ్మూత
గర్తంబందుఁ దిరుగుచుఁ గ్రిమిభక్షిత శరీరుండై
మూర్ఛలం బొందుచుఁ దల్లి భక్షించిన కటుతిక్తోష్ణ లవణ
క్షారామ్లా ద్యుల్బణంబులైన రసంబులచేతఁ
బరితప్తాంగుం డగుచు జరాయువునఁ గప్పంబడి
బహిఃప్రదేశంబునందు నాంత్రంబులచేత బద్ధుండై
కుక్షియందు శిరంబు మోపికొని భుగ్నంబైన పృష్ఠగ్రీవోదరుండై
స్వాంగచలనంబునందు నసమర్థుం
డగుచుఁ బంజరంబునందుండు శకుంతంబు చందంబున
నుండి దైవకృతంబైన జ్ఞానంబునం బూర్వ
జన్మ దుష్కృతంబులం దలంచుచు దీర్ఘోచ్ఛ్వాసంబు
సేయుచు నే సుఖలేశంబునుం బొందక
వర్తించుచు, నంత నేడవనెల యందు లబ్ధజ్ఞానుండై చేష్టలు
గలిగి విట్క్రిమిసోదరుండై యొక్క
దిక్కున నుండక సంచరించుచుం బ్రసూతి మారుతంబుల
చేత నతివేపితుం డగుచు
యాచమానుండును దేహాత్మదర్శియుఁ బునర్గర్భవాసంబు
నకు భీతుండు నగుచు బంధన భూతంబగు
సప్తధాతువులచే బద్ధుండై కృతాంజలి పుటుండు
దీనవదనుండునై జీవుండు దా నెవ్వనిచే నుదరంబున
వసియింప నియమింపంబడే నట్టి సర్వేశ్వరుని నిట్లని
స్తుతియించు.

మూడు నెలలకు గోళ్ళు, వెంట్రుకలు, ఎముకలు, చర్మం, నవరంధ్రాలు ఏర్పడుతాయి. నాల్గవ నెలకు సప్తధాతువులు శుక్లం, శోణితం, మాంసం, చీము, మెదడు, ఎముక, చర్మం కలుగుతాయి. ఐదవనెలకు ఆకలిదప్పులు సంభవిస్తాయి. ఆరవ నెలలో మావిచేత కప్పబడి, తల్లి కడుపులో కుడివైపున తిరుగుతూ ఉంటాడు. తల్లి తిన్న అన్నంతో త్రాగిన నీటితో తృప్తి పొందుతుంటాడు. ధాతువులు (వాత, పిత్త, శ్లేష్మాలు) అభివృద్ధి చెందుతూ ఉంటాయి. మల మూత్రాల గుంటలలో పొర్లుతూ, అందలి క్రిములు శరీరమంతా ప్రాకి బాధపెట్టగా మూర్ఛపోతూ ఉంటాడు.

తల్లి తిన్న కారం, చేదు, ఉప్పు, పులుపు, మొదలైన తీవ్రరసాలు అవయవాలను తపింపచేస్తాయి. మావిచే కప్పబడి, బయట ప్రేగులచే కట్టివేయబడి తల్లిపొట్టలో తలదూర్చి, వంగి ముడుచుకొని పడుకొని ఉంటాడు. తన అవయవాలు కదలించటానికి శక్తిలేక పంజరంలో చిక్కిన పక్షివలె బంధితుడై ఉంటాడు. దైవదత్తమైన తెలివితో, వెనుకటి జన్మలలోని పాపాలను తలంచుకొని, నిట్టూర్పులు విడుస్తాడు. కించిత్తుకూడా సుఖాన్ని పొందలేకుండా ఉంటాడు.

ఏడవ నెలలో జ్ఞానం కలుగుతుంది. కదలికలు కలుగుతాయి. మలంలోని క్రిములతో కలిసి మెలసి ఒకచోట ఉండలేక కడుపులో అటూ ఇటూ తిరుగుతూ ఉంటాడు. గర్భవాయువులకు కంపించిపోతూ దేహాత్మ దర్శనం కలిగి, విమోచనాన్ని యాచించుతూ మళ్ళీ గర్భవాసం కలిగినందుకు భయపడుతూ బంధనరూపాలైన సప్తధాతువులతో బంధితుడై చేతులు జోడించి దీనముఖుడైన జీవుడు ఏ దేవుడు తనకు ఈ గర్భవాసం కలిగించాడో ఆ సర్వేశ్వరుని ఈ విధంగా సంస్తుతిస్తాడు.

(తరువాయి భాగం వచ్చే సంచికలో...)

# శ్రీ విద్యారణ్య స్కూల్ లో ఆపరేషన్ సింధూర్ సందడి



**హైదరాబాద్:–** హైదరాబాద్‌లోని శారదా ధామం ప్రాంగణంలో ఉన్న శ్రీ విద్యారణ్య ఇంటర్నేషనల్ స్కూల్ లో ఎన్‌సీసీ క్యాడెట్ల కోసం ఏర్పాటు చేసిన కార్యక్రమం స్ఫూర్తిదాయకంగా సాగింది. చారిత్రాత్మక **'ఆపరేషన్ సింధూర్'లో** పాల్గొన్న యోధుడు, శౌర్యచక్ర అవార్డు గ్రహీత మేజర్ రణధావా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థులతో ముచ్చటించారు.

మేజర్ రణధావా 'ఆపరేషన్ సింధూర్' మిషన్‌లో తన నిజ జీవిత అనుభవాలను, నాటి యుద్ధ సన్నివేశాలను విద్యార్థులకు వివరించారు. దేశ రక్షణలో సైనికులు చూపే ధైర్యసాహసాలను ఆయన కళ్లకు కట్టినట్లు వివరించడంతో క్యాడెట్లు ఉత్సాహానికి లోనయ్యారు. దేశ సేవ పట్ల విద్యార్థుల్లో ఆయన స్ఫూర్తిని నింపారు. పాఠశాల కార్యదర్శి విశ్వేశ్వరరావు సూచనలతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కమిటీ సభ్యులు వెంకటస్వామి మాట్లాడుతూ విద్యార్థులకు స్ఫూర్తి కలిగించారు. స్విస్ ప్రిన్సిపాల్ డాక్టర్ క్రిష్ణ మోహన్, వైస్ ప్రిన్సిపాల్ రమావిశ్వనాథ్, ఎన్‌సీసీ ఆఫీసర్స్ చారి, సులోచనల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. ★

---

**వనపర్తి :–** శ్రీ సరస్వతీ శిశు మందిరం వనపర్తి పాఠశాల 48 వ వార్షికోత్సవం తేదీ:23.04.2026 సాయంత్రం జరిగినది.ఇందులో వనపర్తి శాసనసభ్యులు శ్రీ తూడి మేఘారెడ్డి గారు పాల్గొన్నారు.సరస్వతీ మాత పూజ కార్యక్రమంలో పాల్గొని , శిశు మందిరాల లో చదివిన విద్యార్థులలో దేశభక్తి,క్రమశిక్షణ ఉంటుందని సంస్కృతి, సంప్రదాయాల పట్ల గౌరవం కలిగి,కుటుంబ విలువలకు పట్టంకడతారని కొనియాడారు..సమాజం డ్రగ్స్,అశ్లీలత తో కునారిల్లుతున్న ఈ దశలో శిశు మందిరాలు విస్తరించడం అత్యంత ఆవశ్యకం అని అన్నారు..ఇక్కడ విశాల హృదయం గల దాతలు పాఠశాలను నిర్మిస్తే,గౌరవ వేతనాలు తీసుకునే ఆచార్యమాతాజీ లు అకుంఠిత దీక్షతో పనిచేస్తారని,సేవాదృక్పథము తో పనిచేసే సమితి, ప్రబంధకారిణి సభ్యులు గుడి లాంటి ఈ బడి ని బాగుచేస్తారని కొనియాడారు..పెద్దమందడి పాఠశాల భవననిర్మాణం లో తాను భాగస్వాముడను అవుతానని మాట ఇచ్చారు.విద్యార్థుల చే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు 1000 మందికి పైగా పాల్గొనిన ప్రజలను విశేషంగా ఆకర్షించాయి.

కార్యక్రమంలోమున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ వార్డు కౌన్సెలర్లు విజయలక్ష్మి గారు,పరుశురాం,బ్రహ్మచారి , RC foundation స్థాపకులు రమేష్ చంద్ర, స్థానిక SI మరియు పూర్వ విద్యార్థి రిషి కుమార్, విద్యాశాఖ AMO మహానంది, జమీ ప్రతాప్ రెడ్డి, ZP సుపెరిండెంట్ గట్టుమీది భానుప్రసాద్, వక్త ,పాలమూరు విభాగ్ సహకార్యదర్శి రాజ మల్లేష్, పాలమూరు విభాగ్ సేవాభారతి అధ్యక్షుడు రాందేవరెడ్డి, వనపర్తి జిల్లా అధ్యక్షులు శ్రీ సూర్య నారాయణ, కార్యదర్శి ధనుంజయ్ గౌడ్, పాఠశాల అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, సభ్యులు భాస్కర్ శరత్ ,యుగేందర్,లక్మి నరసింహారెడ్డి గార్లు, మాతృమండలి కరుణ, కవిత, వీరమణి, హైమావతి గార్లు పాల్గొన్నారు.కార్యక్రమమును కార్యదర్శి అరవింద్ ప్రకాష్, ప్రిన్సిపాల్ కిషోర్ కుమార్ సమన్వయం చేశారు. ★









**గ్రాడ్యుయేషన్ డే :-** శ్రీ సరస్వతీ శిశుమందిర్ ఇంగ్లీష్ మీడియం ఆసిఫాబాద్ పాఠశాల లో ప్రీ ప్రైమరీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు-విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే ముందు ప్రాథమిక విద్యాభ్యాసం తోనే మొదలవుతుందని తెలిపారు. యుకేజీ విద్యార్థులకు ప్రముఖ డెంటిస్ట్ శ్రీమతి వొజ్జల కళ్యాణి గారు మరియు పోషకులు మెడల్స్ మరియు సర్టిఫికేట్ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంచాలన సమితి ఉపాధ్యక్షులు కొడిపాక వేణుగోపాల్, కార్యదర్శి నాగుల శ్రీనివాస్, సభ్యులు జంజిరాల శ్రీనివాస్, ప్రధానాచార్యులు గుండేటి కోటేశ్వరరావు , ఆచార్యులు విద్యార్థులు పాల్గొన్నారు.

★

## శ్రీ రామకృష్ణ విద్యాలయంలో ఘనంగా నిర్వహించిన సంస్కార కేంద్రాల విద్యార్థుల సమ్మేళనం






**ఖమ్మం:-** శ్రీ రామకృష్ణ విద్యాలయంలో సంస్కార కేంద్రాల విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించబడింది. ఖమ్మం అంతటా నడుస్తున్న 17 సంస్కార కేంద్రాల విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం శ్రీ దేవకి వాసుదేవరావు, విభాగ్ అధ్యక్షులు గారి మార్గదర్శకత్వంలో జరిగింది.

ఈ కార్యక్రమంలో విద్యార్థులు శ్లోకాలు, పద్యాలు, నాటికలు, నీతి కథలు, పాటలు, నృత్యాలు వంటి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ ప్రదర్శనలు సంస్కార కేంద్రాలలో అందిస్తున్న సాంస్కృతిక మరియు నైతిక విలువలను ప్రతిబింబించాయి.

ఈ కార్యక్రమానికి రాష్ట్ర అకాడెమిక్ ఇన్‌చార్జ్ శ్రీ నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యులు, రాష్ట్ర సేవా ప్రముఖ్ శ్రీ జి ఎల్ ఎన్ శాస్త్రి, రాష్ట్ర సేవా సంయోజక్ శ్రీ గౌరుగారి గంగాధర్ రెడ్డి, విభాగ కార్యదర్శి శ్రీ కరవది వెంకట శ్రీనివాసరావు, పాఠశాల కార్యదర్శి శ్రీ గన్నవరపు చంద్రశేఖర్, శ్రీ కార్లపాటి సురేష్, విద్వత్ సమితి సభ్యులు శ్రీ యచ్చ రామకృష్ణరావు, ప్రధానాచార్యులు శ్రీ సంతోష గౌతమ్ పాల్గొన్నారు. అధ్యాపకులు, సంస్కార కేంద్రాల విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

★

# శిశుమందిరాలలో వార్షికోత్సవ వేడుకలు




రామాయంపేట-అశోక్‌సింఘాల్ పాఠశాల



దొనబండ




వినాయక్‌చౌక్-ఆదిలాబాద్




నారాయణఖేడ్



పాల్వంచ



పెద్దపల్లి




రవీంద్రనగర్-నల్గొండ



సైదాబాద్

# విద్యాపీఠ ఆవిర్భావ దినోత్సవ వేడుకల చిత్రాలు



భగత్‌సింగ్‌నగర్-కామారెడ్డి




బుధవార్‌పేట్




చాగలమర్రి



కామారెడ్డి




కార్వాన్



కె.డి.ఆర్.నగర్



కేశవనగర్



వెంకటరమణనగర్ కాలనీ

# శ్రీరామనవమి ఉత్సవ వేడుకల చిత్రమాలిక



ఆర్.కె.విద్యాలయం-ఖమ్మం




శ్రీవిద్యారణ్య ఇంటర్‌నేషనల్ స్కూల్



తడ్కపల్లి



ఆళ్ళగడ్డ



అమరాపురం



బాదేపల్లి



బజార్‌హత్నూర్



రామాయంపేట



కామారెడ్డి

# శిశుమందిర్ పాఠశాలలలో ఉగాది ఉత్సవ వేడుకలు



ఆళ్ళగడ్డ



కోరుట్ల

# శిశుమందిరాలలో వార్షికోత్సవ వేడుకలు




కాగజ్‌నగర్–ద్వారక




పాత గుంటూరు




అశోక్‌నగర్–నారాయణపేట

# శిశుమందిర్ బాలలు గీసిన చిత్రాలు




కౌశిక్ 5వ తరగతి–సదాశివపేట




వి. విశ్వతేజ – 6వ తరగతి – పఠాన్‌చెరువు



ఆర్యన్ శరణ్ – 4వ తరగతి – సరూర్‌నగర్



రిషిక దుర్గసాయి – 4వ తరగతి– కల్వకుర్తి




మానస–7వ తరగతి– అమరచింత



కె.శ్రీప్రద–యు.కె.జి.–శ్రీశారదాధామము

జి.క్రి.

# లోక జ్ఞానము - 210



అయాచితుల లక్ష్మణరావు

## ఏప్రిల్ 2026, "స్ఫూర్తి" ఆధారంగా

1. శ్రీమద్భాగవతం సంస్కృతంలో వ్రాసినది ఎవరు?
2. దక్షిణాదిన శంకరాచార్యులు స్థాపించిన మఠం ఏది?
3. శివాజీ తల్లి ఎవరు?

### ధర్మం - సంస్కృతి

4. ప్రతి హిందూ గృహంలో పూజలందుకునే మొక్క ఏది?
5. రామాయణానికి గల ఇతర పేర్లు ఏమి?
6. విష్ణుమూర్తి వాహనం ఏది?

### గణిత - వైజ్ఞానిక అంశములు

7. సగటు కనుగొనుటకు సూత్రము ఏమి?
8. రామానుజన్ సంఖ్య ఏది?
9. మైక్రోస్కోప్ దేనికి ఉపయోగిస్తారు?

### సామాజిక శాస్త్రాలు

10. మన దేశంలో పొడవైన నది ఏది?
11. ఆరావళి పర్వతాలు ఏ రాష్ట్రంలో అధికంగా విస్తరించి ఉన్నాయి?
12. మన దేశం ఏ అర్ధగోళంలో ఉంది?

### సమకాలీన అంశాలు

13. తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎవరు నియామకమయ్యారు?
14. తెలంగాణ రాష్ట్ర ప్రస్తుత గవర్నర్ ఎవరు?
15. ప్రస్తుత బీహార్ ముఖ్యమంత్రి పేరేమి?

## లోక జ్ఞానము -209 సమాధానములు

1. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్
2. భీష్మకమహారాజు
3. 2047
4. కయాదు
5. వాల్మీకి ఆశ్రమం
6. ఇంద్రుడు
7. న్యూక్లియర్ విచ్ఛిన్నం
8. పాల ఉత్పత్తి
9. ఐరన్
10. నాసిక్– త్ర్యంబక్
11. తమిళనాడు
12. డా॥ బాబు రాజేంద్ర ప్రసాద్
13. ఇరాన్
14. భారత దేశం
15. శివప్రతాప్

## 141 జతపరచుము సమాధానాలు

| | | |
|---|---|---|
| 1 | ట. | రవీంద్రనాథ్ ఠాగూర్ |
| 2 | త. | రాజగోపాల చారి |
| 3 | ప. | బాలగంగాధర తిలక్ |
| 4 | క. | సుభాస్ చంద్ర బోస్ |
| 5 | చ. | మాధవ సదాశివ గోల్వాల్కర్ |

## 142- జతపరచుము

| | | |
|---|---|---|
| 1. బృందావన్ | (   ) | క) కేరళ |
| 2. ఉదయ్‌పూర్ | (   ) | చ) కర్ణాటక |
| 3. ద్వారక | (   ) | ట) ఉత్తరప్రదేశ్ |
| 4. హంపి | (   ) | త) రాజస్థాన్ |
| 5. శబరిమల | (   ) | ప) గుజరాత్ |

విద్యార్థులు గానీ,
ఆచార్యులు గానీ మీ సమాధానాలను వ్రాసి స్ఫూర్తి విభాగానికి తపాల / కొరియర్ ద్వారా పంపగలరు.
(లేదా)
sphoortissvp@gmail.com కి మెయిల్ ద్వారా పంపగలరు.

పోషకుల పేజి

# సెలవుల్లో ఇలా!



- లింగం సుధాకర్ రెడ్డి

వేసవి సెలవులొస్తున్నాయంటే అమ్మలకు భయమే! కానీ ఇప్పుడాభయం అక్కర్లేదు. ఈ విషయంలో అనేక అధ్యయనాలు పిల్లల తల్లిదండ్రులకు మార్గదర్శకాలుగా పేపర్లలో ప్రచురించబడుతున్నాయి. పిల్లలు ఏ మట్టిలో ఆడతారో, ఏ అలర్జీలు కొని తెచ్చుకుంటారోనని. వారిపై కఠినమైన నిఘా ఉంచుతారు. లేదంటే శానిటైజర్లు వెంట పంపిస్తారు. హ్యాండ్ వాష్‌లతో పదే పదే చేతులు కడిగిస్తుంటారు. కానీ... ఏం పర్లేదు ఆడుకోనివ్వండి అంటారు నిపుణులు.

**మట్టి మంచిదే! :-** కాలం మారినా, పిల్లలు అనారోగ్యాల బారినపడుతూ ఉండటానికి కారణం రోగనిరోధక శక్తి లేకపోవడమే. మట్టిలో సూక్ష్మక్రిములు ఉంటాయి. అవి పిల్లల ఆనారోగ్యానికి చేటు అని కంగారుపడతాం. కానీ... అవే వాళ్ల ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయి. ఇవి వాళ్ళ రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తాయి. దీంతో ఆరోగ్యంగా ఉంటారు. ఎన్నిసార్లు వద్దన్నా మట్టిలోనే అడతారెందుకు! అన్న అనుమానం చాలాసార్లే వచ్చుంటుంది. దీని కారణంగా వాళ్లలో సెరటోనిన్ విడుదలవుతుందట. కాబట్టే, ఆ ఆనందాన్ని సొంతం చేసుకోవాలని పదే పదే ఆడుతుంటారు. అంటే మానసిక ఆరోగ్యం కూడా. పైగా మట్టిని తవ్వడం, దానిలో నడవడం, వివిధ ఆకారాలు చేయడం వంటివన్నీ మోటార్ నైపుణ్యాలను పెంచడమే కాదు... వాళ్లనీ దృడంగా మారుస్తాయి. మట్టిని తాకడం, వాసన పీల్చడం వంటివి ప్రకృతికి దగ్గర చేస్తాయి. సృజనాత్మకతను తట్టి లేపుతాయి. ఇది మెదడు ఎదుగుదలకీ మంచిదే. కాబట్టి, ఆడుకోనివ్వండి. అలాగని మరీ అపరిశుభ్రంగా ఉంటే ప్రోత్సహించనక్కర్లేదు. క్లే ఆర్ట్‌లో చేర్చొచ్చు, లేదంటే మీ గార్డెన్ లోని మట్టితోనే ఆడుకోనిస్తే సరి.

**'ఇలా ఆడుకోనివ్వండి'**

చాలా పాఠశాలలకు మైదానాలు లేవు. పిల్లలు ఆటలకు దూరంగా ఉంటున్నారు. ఇది వారిలో ఊబకాయం, ఫ్యాటీలివర్ తదితర సమస్యలకు దారి తీస్తున్నది. అందుకని ఆటలాడుకోనివ్వాలి. కానీ... పిల్లలకి సంబంధించిన ప్రతి విషయంలోనూ... చివరికి వాళ్ల అటల్లోనూ జోక్యం చేసుకునే పెద్దవాళ్లకి పాఠం. ఇప్పటిదాకా పరిశోధకులు పిల్లలకి ఎలాంటి ఆటలుంటే మంచిది? అంటూ తల్లిదండ్రులు ,టీచర్ల దగ్గరే అభిప్రాయాలు అడుగుతూ వచ్చారు. కానీ డెన్మార్క్ లోని ఆహస్ వర్సిటీ శాస్త్రవేత్తలు కాస్త విభిన్నంగా ఆలోచించారు. ఈసారి వాళ్ళు పిల్లలకే ఆ ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టారు. తొమ్మిది నుంచీ 13 ఏళ్లలోపున్న దాదాపు వెయ్యిమంది చిన్నారుల్ని ఇంటర్వ్యూ చేశారు. వాటన్నింటినీ క్రోడీకరించి కొన్ని అంశాలని వెల్లడించారు. వాటిల్లో పిల్లలందరూ చెప్పిన ఓ ప్రధాన అంశం 'మా ఆటల్లో పెద్దవాళ్లు తలదూర్చితే అసలు ఎంజాయ్ చేయలేం' అని టీమ్ బిల్డింగ్ పేరుతోనో, రూల్స్ నేర్పాలనో పెద్దవాళ్ళు తలదూర్చితే అది పీఈటీ క్లాస్‌లా ఉంటుంది తప్ప సరదా ఆటలా ఉండదని అన్నారట వీళ్లందరూ! 'అదిసరే మీ దృష్టిలో మంచి ఆటంటే ఏమిటీ?' అన్న ప్రశ్నకి 'మమ్మల్ని నవ్వించేదీ... అలసిపోయేంతగా పరుగెత్తించేదీ... గెంతించేదీ ఏదైనా మంచి అటే' అని చెప్పారట. ఆడుతున్నంత సేపూ మేము అందులో ఓ భాగం అన్న ఫీలింగ్ ఉండాలి.. మా రూల్స్ మేమే పెట్టుకోవాలి.... అప్పుడే ఎంజాయ్ చేస్తాం' అనీ వివరించారట ఈ పిల్లలు.

**కష్టం నుంచి బయటపడేసే కథ! :-** '2004లో వచ్చిన సునామీ ఎన్నో లక్షలమందిని పొట్టనపెట్టుకుంది. సుమత్రా

దగ్గరున్న సీమెలు ద్వీపంలోని ప్రజలు మాత్రం ఆ రాకాసి అలల రాకని ముందే గుర్తించి, ఎత్తైన ప్రాంతాలకు వెళ్లి ప్రాణాలు కాపాడుకున్నారు. ఇదేలా సాధ్యం అయిందంటే... సునామీ రాకను ముందుగానే సూచించే లక్షణాలని సిమెలు తెగ పెద్దలు పిల్లలకు చిన్నతనం నుంచీ కథల రూపంలో చెప్పడమే' అంటున్నారు మిసిసిపీ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు. కథలు పిల్లల్లో సృజనాత్మకశక్తిని మాత్రమే కాదు జ్ఞాపకశక్తినీ పెంచుతాయట. అన్నింటి కంటే ముఖ్యంగా ప్రమాద సమయంలో ఆ పరిస్థితుల నుంచి ఎలా బయటపడాలో చెప్పే "సర్వైవల్ స్కిల్స్" కథలు బాగా గుర్తు పెట్టుకునేలా చేస్తాయని తమ పరిశోధనలతో నిరూపించారీ శాస్త్రవేత్తలు. ఇందుకోసం నాలుగువందలమంది పిల్లలని కొన్ని బృందాలుగా విడదీసి వాళ్లకి క్లిష్ట సమయంలో బయటపడేందుకు అవసరమైన కొన్ని ముఖ్యమైన పదాలను చెప్పి గుర్తు పెట్టుకొమ్మన్నారు. ఒక బృందం ఈ పదాలని కథలాగా మార్చుకుని గుర్తు పెట్టుకుంటే, మరొక బృందం ఆ పదాలు తమని ఎలా రక్షిస్తాయో ఊహించుకుంటూ గుర్తు పెట్టుకుంది. తక్కినవారు వాటిని యథాతథంగా గుర్తు పెట్టుకోవడానికి ప్రయత్నించారు. కొన్ని రోజుల తర్వాత పిల్లల జ్ఞాపకశక్తిని పరీక్షించినప్పుడు, తక్కిన వాళ్లతో పోలిస్తే-కథగా గుర్తు పెట్టుకున్న వాళ్లు ఎక్కువ పదాలు గుర్తు పెట్టుకున్నారు. అందుకే ప్రమాద సమయంలో బయటపడేందుకు. అవసరమైన సర్వైవల్ స్కిల్స్‌ని చిట్టిపొట్టి కథల ద్వారా పిల్లలకు చెప్పమంటున్నారీ శాస్త్రవేత్తలు.

**చదువుతోనే భవిత:-** టీవీలు, సెల్‌ఫోన్, వీడియో గేమ్స్ యావలో పడి పిల్లల్లో పఠనం తగ్గుతున్నట్లు పలు అధ్యయనాలు చెబుతున్నాయి. పఠనం వైపు నెమ్మదిగా మళ్లించాలి. చిన్న చిన్న కథలు చదివించడం, సైన్స్ పుస్తకాలు చూపించడం... పలు విధాలుగా పుస్తకాలంటే ఆసక్తి ఏర్పడేలా చేయాలి. రోజుకు అరగంట లేదా గంట వారితో పాటు తల్లిదండ్రులు కూర్చొని చదవాలి. మీరు చదువుతుంటే వారు కూడా నెమ్మదిగా మీ బాటలో నడుస్తారు.

**అభిరుచులను గుర్తించాలి:-** ప్రతి చిన్నారిలో ఒక్కో టాలెంట్ ఉంటుంది. వారి అభిరుచిని గుర్తించి ఆ వైపు ప్రోత్సహించాలి. కొందరికి చిత్రలేఖనం, మరికొందరికి సంగీతం, ఇంకొందరికి నృత్యం, ఇంద్రజాలం, రచనలు చేయడంలాంటి ఆసక్తి ఉంటుంది. ఆయా రంగాల్లో శిక్షణ ఇప్పిస్తే కెరీర్‌లో ఉన్నత స్థానాలకు ఎదుగుతారు.

**సమాజ సేవలో-భాగస్వామ్యం:-** ఉత్తమ పౌరులతోనే ఉత్తమ సమాజాన్ని ఆశించగలం. చిన్నప్పటి నుంచే సమాజం పట్ల బాధ్యత పెంచడం, నైతిక విలువలు నేర్పించడం అవసరం. దీనుల పట్ల దయ, జాలి. సాయం చేయడం లాంటి గుణాలు పిల్లలకు తెలిసేలా చేయాలి. నగరంలో పలు గుర్తింపు ఉన్న ఎన్‌జీవోలు ఆ దిశగా సేవలు అందిస్తుంటాయి. సెలవుల్లో ఒకటి రెండు సార్లు అక్కడికి తీసుకెళ్లి వారి కార్యక్రమాలు పిల్లలు తెలుసుకునేలా చేయాలి. అనాథలు, వృద్ధులు ఉంటే పిల్లల చేత తోచినంత సాయం అందించాలి. ఇలాంటి అలవాట్లు ఉత్తమ ప్రవర్తనకు మార్గం చూపుతాయి. ★

---

**వికారాబాద్:-** వికారాబాద్‌లోని ఇంగ్లీషు మీడియం (CBSE) ప్రాథమిక పాఠశాల అయిన శ్రీ సరస్వతి శిశు మందిరాన్ని సందర్శించిన తెలంగాణ రాష్ట్ర సరస్వతీ వేదిక సేవా కో-ఆర్డినేటర్ శ్రీ గంగాధర్ రెడ్డి, సిబ్బంది మరియు విద్యార్థులను ఉద్దేశించి, స్ఫూర్తిదాయకమైన కథలతో మార్గదర్శనం చేశారు. ★

---



**కాళినగర్ :-**శ్రీ సరస్వతీ విద్యా పీఠము ప్రాంత సేవా విభాగము ఆధ్వర్యంలో పాజిటివ్ హోమియో లైఫ్ సైన్సెస్ సౌజన్యంతో వేసవి వేడి అధికము అవుతున్న కారణముగా "వడ దెబ్బ సోకకుండా ప్రివెంటివ్ హోమియో మెడిసిన్స్" శ్రీ విద్యారణ్య ఇంటర్నేషనల్ స్కూల్ సంచాలితముగా నిర్వహించబడుతున్న కాళికా నగర్ సేవా బస్తీ లోని సంస్కార కేంద్ర బాల బాలికలకు శ్రీ విద్యారణ్య ఇంటర్నేషనల్ స్కూల్ సేవా ప్రముఖ్ పోచమ్మ గారి నవీన్ మరియు సంస్కార కేంద్ర శిక్షక్ శ్రీమతి శారద హోమియో ప్రివెంటివ్ మెడిసిన్స్ ఇస్తున్న దృశ్యం. ★

# పునాది అక్షరాస్యత



– కొత్తపల్లి ఉమ,
ప్రాంత శిశువాటిక ప్రముఖ్, తెలంగాణ

(గత సంచిక తరువాయి భాగం ...)

**5. ఊహాశక్తి మరియు సృజనాత్మకతకు మద్దతు ఇస్తుంది.**

→ కథలు పిల్లలను తమ తక్షణ అనుభవాలకు మించి ఆలోచించేందుకు ప్రోత్సహిస్తాయి.

→ పిల్లలు తమ స్వంత కథలను సృష్టించుకుంటారు.

→ ఊహాశక్తి భాషను మరింత సమర్థంగా ఉపయోగించేందుకు సహాయపడుతుంది.

**6. జ్ఞాపకశక్తి మరియు క్రమబద్ధతను బలపరుస్తుంది.**

→ కథలకు ప్రారంభం, మధ్య, ముగింపు ఉంటాయి.

→ పిల్లలు క్రమాన్ని, కారణ ఫలిత సంబంధాన్ని నేర్చుకుంటారు.

→ ఇది తార్కిక ఆలోచనకు మరియు భవిష్యత్తులో రచనా నైపుణ్యాలకు మద్దతు ఇస్తుంది.

**7. భావోద్వేగ మరియు సామాజిక అవగాహనను పెంపొందిస్తుంది.**

→ కథలు భావాలు, సంబంధాలు, విలువలను అర్థం చేసుకోవడంలో పిల్లలకు సహాయపడతాయి.

→ భాష అర్థవంతంగా మరియు సహానుభూతితో నిండి ఉంటుంది.

→ పిల్లలు భావాల గురించి మాట్లాడడం నేర్చుకుంటారు.

**ప్రశ్న: కథ చెప్పడం ఎలా చేయాలి?**

**1. వయస్సుకు తగిన కథలను ఉపయోగించండి.**

→ చిన్న పిల్లలకు సరళమైన, చిన్న కథలు ఎంచుకోండి.

→ క్రమంగా కథల పొడవు మరియు క్లిష్టతను పెంచండి.

→ పరిచయమైన వాతావరణం మరియు పాత్రలను ఉపయోగించండి.

**2. కథను పరస్పర చర్యతో నింపండి.**

→ కథ మధ్యలో ప్రశ్నలు అడగండి.

→ ఊహించమని ప్రోత్సహించండి. (“ తర్వాత ఏమి జరుగుతుందని మీరు అనుకుంటున్నారు?”)

→ పదాలు లేదా శబ్దాలను పిల్లలతో పునరావృతం చేయించండి.

**3. స్వరం, భావ వ్యక్తీకరణ మరియు హావభావాలను ఉపయోగించండి.**

→ పాత్రలకు అనుగుణంగా స్వరం మార్చండి.

→ ముఖాభినయాలు మరియు చర్యలను ఉపయోగించండి.

→ ఇది పిల్లల దృష్టిని నిలుపుతూ అర్థం చేసుకోవడాన్ని మెరుగుపరుస్తుంది.

**4. దృశ్య సహాయాన్ని ఉపయోగించండి.**

→ చిత్ర పుస్తకాలు, పప్పెట్లు, ఫ్లాష్కార్డులు లేదా వస్తువులను ఉపయోగించండి.

→ దృశ్యాలు ముఖ్యంగా చిన్న పిల్లలకు అర్థగ్రహణంలో సహాయపడతాయి.

**5. మళ్లీ చెప్పడం మరియు పాత్రాభినయాన్ని ప్రోత్సహించండి.**

→ పిల్లలు తమ మాటల్లోనే కథను మళ్లీ చెప్పేందుకు అవకాశం ఇవ్వండి.

→ పప్పెట్లు, చిత్రాలు లేదా నాటకీకరణను ఉపయోగించండి.

→ భాగంగా లేదా మిశ్రమ భాషలో ఇచ్చే సమాధానాలను కూడా అంగీకరించండి.

**6. కథలను పునరావృతం చేయండి.**

→ పునరావృతం పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని మరియు భాషపై పట్టు పెంచుతుంది.

→ పరిచయమైన కథలను పిల్లలు ఆనందంగా

వింటారు మరియు ప్రతి సారి మరింతగా నేర్చుకుంటారు.

7. **కథలను నిజ జీవితంతో అనుసంధానం చేయండి.**

→ కథ పిల్లల అనుభవాలకు ఎలా సంబంధం ఉందో చర్చించండి.

→ పాత్రల భావాలు, చర్యల గురించి ప్రశ్నలు అడగండి.

**ప్రశ్న: కథలు ఎవరు చెప్పాలి?**

1. **తల్లిదండ్రులు మరియు కుటుంబ సభ్యులు.**

→ ఇంట్లో ప్రతిరోజూ కథలు చెప్పడం బలమైన భాషా పునాదిని నిర్మిస్తుంది.

→ ఇంటి భాషలో చెప్పే కథలు అర్థగ్రహణాన్ని మరింత బలపరుస్తాయి.

→ తాతమ్మలు, అమ్మమ్మలు వంటి పెద్దలు సాంస్కృతిక సంపదను అందిస్తారు.

**2. ఉపాధ్యాయులు మరియు సంరక్షకులు.**

→ తరగతిలో కథ చెప్పడం ఒక నిత్య కార్యక్రమంగా ఉండాలి.

→ ఇది సర్కిల్ టైమ్ మరియు ఆటల ఆధారిత అభ్యాసంలో భాగంగా ఉండాలి.

→ ఉపాధ్యాయులు స్పష్టమైన, సంపన్నమైన భాషకు మాదిరిగా నిలుస్తారు.

3. **పిల్లలే కథలు చెప్పాలి.**

→ పిల్లలను కథలు చెప్పేందుకు ప్రోత్సహించాలి.

→ తమ అనుభవాలను పంచుకోవడం వారి ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది.

→ స్నేహితులతో కథలు చెప్పడం భాషా సాధనకు మద్దతు ఇస్తుంది.

**కథ ప్రదర్శన (కథ చెప్పే విధానం)**

కథను చెప్పే విధానం అత్యంత ముఖ్యమైనది. కథను నెమ్మదిగా, స్పష్టంగా చెప్పాలి.

**వాడాలి**

→ స్వర మార్పులు.

→ ముఖాభినయాలు.

→ హావభావాలు మరియు విరామాలు.

→ కళ్లలోకి చూసి మాట్లాడటం.

→ ముఖ్య పదాలు, శబ్దాలను పునరావృతం చేయడం.

**భాషా దృష్టి: వినికిడి అర్థగ్రహణం, వాక్య నమూనాలు.**

**కథ సమయంలో పరస్పర చర్య.**

→ ఓపెన్ ఎండెడ్ ప్రశ్నలతో పిల్లలను పాల్గొనేటట్లు చేయండి (" తర్వాత ఏమి జరుగుతుందని మీరు అనుకుంటున్నారు?")

→ శబ్ద ప్రభావాలు, చర్యలతో పదాలు/వాక్యాలను పునరావృతం చేయించండి.

→ ఏ భాషలో లేదా హావభావాల ద్వారా స్పందించినా అంగీకరించండి

**కథ తర్వాత చర్చ**

→ అర్థం మరియు భావ వ్యక్తీకరణను లోతుగా చేయండి.

→ పాత్రలు, సంఘటనలు. భావాలపై ప్రశ్నలు అడగండి.

→ పిల్లలు తమ అభిప్రాయాలను చెప్పేందుకు ప్రోత్సహించండి ("మీకు ఏ భాగం నచ్చింది?")

**కథ తర్వాత కార్యకలాపాలు.**

→ చిత్రాలు, పప్పెట్లు, డ్రాయింగ్స్ ద్వారా కథను మళ్లీ చెప్పించడం.

→ ప్రాత్రాభినయం లేదా నాటకీకరణ.

→ చిత్రాల క్రమబద్ధీకరణ (మొదలు మధ్య ముగింపు).

→ **భాషా దృష్టి:** మాట్లాడటం, క్రమబద్ధత, ప్రవాహం

→ ఇష్టమైన దృశ్యాన్ని గీయించి వివరించమని అడగడం.

→ కథకు సంబంధించిన పాట లేదా లయ నేర్పించడం.

→ కథను నిజ జీవిత అనుభవాలతో అనుసంధానం చేయడం.

→ **భాషా దృష్టి:** పదసంపద వినియోగం మరియు బదిలీ.

## పిల్లలకు విలువలను నేర్పించడం

ఎందుకు? ఎప్పుడు? ఎక్కడ? ఎవరు? ఏమి? ఎలా?

పిల్లలకు విలువలు ఎందుకు నేర్పాలి అనేది అందరికీ స్పష్టంగా అనిపించవచ్చు – కానీ అలా కాకపోవచ్చు కూడా!

విలువలు ఎప్పుడు నేర్పాలి అనేది సులభంగా అనిపించవచ్చు – కానీ ప్రారంభం ఎప్పటి నుంచి అన్న ప్రశ్న రావచ్చు.

ఎవరు నేర్పాలి?

ఎక్కడ నేర్పాలి?

ఏ విలువలు నేర్పాలి? ఎలా నేర్పాలి?

ఎందుకు? (WHY?)

పిల్లలకు నైతిక విలువలు ఎందుకు నేర్పాలి?

→ మన తల్లిదండ్రులు మనకు నేర్పారు కాబట్టి?

→ అవి సంప్రదాయాలు కాబట్టి?

→ సమాజం సురక్షితంగా, సక్రమంగా ఉండేందుకు అవసరం కాబట్టి?

→ మనం వాటిని నమ్ముతాం కాబట్టి?

→ అవి సరి అయినవి కాబట్టి?

→ విలువలతో కూడిన ప్రవర్తన పిల్లల్లో స్వాతంత్ర్యం, ఆత్మవిశ్వాసం, స్వయం ఆధారితత్వాన్ని పెంపొందిస్తుందని పరిశోధనలు చెబుతున్నాయి కాబట్టి?

→ పిల్లల ఆనందానికి మనం చేయగల అత్యంత ముఖ్యమైన, ప్రభావవంతమైన పని ఇదే కాబట్టి?

ఎప్పుడు? (WHEN?)

ఇప్పుడే – ఎప్పుడూ (NOW & ALWAYS)

→ "పిల్లలు పెద్దయ్యాక వాళ్లే తమ విలువలను ఎంచుకుంటారు" అనే భావనతో విలువలను నేర్పకపోవడం సరైన పద్ధతి కాదు.

→ తల్లిదండ్రుల సహాయం ఉన్నా లేకపోయినా, పిల్లలు ప్రీ––స్కూల్ దశలోనే తమ విలువలను అవచేతనంగా, చైతన్యంగా అభివృద్ధి చేసుకుంటారు. వీటిని కొంతమేర స్నేహితుల నుండి, సమాజం నుండి, ముఖ్యంగా కుటుంబం నుండి నేర్చుకుంటారు.

→ పాఠశాల దశలో వారు ఈ విలువలను పరీక్షించి, మారుస్తూ ఉంటారు. కిశోర దశలోకి వచ్చేసరికి స్వతంత్రంగా ఆలోచించడం మొదలుపెట్టి, తమకంటూ ఒక విలువల వ్యవస్థను ఏర్పరచుకుంటారు–అది సాధారణంగా తల్లిదండ్రుల విలువలతో చాలా దగ్గరగా ఉంటుంది.

→ తల్లిదండ్రులు విలువల గురించి మాట్లాడకపోతే, పిల్లలు "విలువలు అంత ముఖ్యమైనవి కావు" అనే సందేశాన్ని నేర్చుకుంటారు.

→ తల్లిదండ్రులు స్పష్టంగా విలువలపై దృష్టి పెట్టినప్పుడు, పిల్లల వ్యక్తిత్వ వికాసం మరింత బలంగా జరుగుతుంది.

→ పన్నెండు నెలలు – పన్నెండు అధ్యాయాలు: ప్రతి నెల ఒక విలువపై దృష్టి పెట్టడం ద్వారా తల్లిదండ్రులు అవచేతనంగా, చైతన్యంగా పిల్లలకు ఆ విలువను నేర్పగలరు.

→ ప్రతి నెల ఒక చిన్న కథ లేదా అనుభవంతో ప్రారంభమై, చిన్నపిల్లలకు సరిపోయే కథలు, పాటలు, పద్యాల ద్వారా ఆ విలువను అర్థమయ్యేలా చేస్తుంది.

→ ప్రాథమిక తరగతుల పిల్లల కోసం ఆటలు, బహుమతులు, కథలు ఉపయోగిస్తారు.

→ కిశోరుల కోసం చర్చలు, పాత్రధారణ (role play), అనుభవాల పంచుకోవడం ఉపయోగపడుతుంది.

ఏ వయసులోనైనా పిల్లలకు విలువలు నేర్పాలి.

ఎక్కడ? (WHERE?)

కుటుంబంలో!

ఇంట్లో!

→ ఇంట్లో నేర్పే విలువలు - మంచి అయినా చెడు అయినా - పాఠశాలకన్నా ఎక్కువ ప్రభావం చూపుతాయి.

→ తల్లిదండ్రులకు కనీసం ఐదేళ్ల ముందస్తు అవకాశముంటుంది.

→ పిల్లల జీవితంలో మొదటి 14--15 సంవత్సరాల పాటు తల్లిదండ్రుల ప్రభావం అత్యధికంగా ఉంటుంది.

→ కుటుంబమే మౌలిక సంస్థ. తల్లిదండ్రులే ప్రధాన బాధ్యత వహించాలి.

→ పిల్లలకు మంచి విలువలు నేర్పడం ద్వారా వచ్చే ఆనందం అపారమైనది.

ఎవరు? (WHO?)

తల్లిదండ్రులా?

ఎవరు?

మీరు!

→ కొందరు తల్లిదండ్రులు తమ బాధ్యతను పాఠశాల, ఉపాధ్యాయులు, శిక్షకులు, కౌన్సిలర్లు మొదలైన వారికి అప్పగిస్తారు.

→ ఇవన్నీ సహాయక పాత్ర మాత్రమే పోషించాలి.

→ పిల్లల విలువల నిర్మాణానికి పూర్తి బాధ్యత తల్లిదండ్రులదే.

ఏమి? (WHAT?)

→ విశ్వవ్యాప్త విలువలు ఉన్నాయా?

→ ఎలాంటి మతానికీ పరిమితం కాని నైతిక విలువలు ఉన్నాయా?

→ ఈ article తల్లిదండ్రులు తమ పిల్లలకు ఏ విలువలు నేర్పాలనుకుంటున్నారో స్పష్టంగా తెలుసుకోవడంలో సహాయపడుతుంది.

→ విలువలు వ్యక్తిగతమైనవి.

→ ఈ article ఎవరికైనా ప్రత్యేక విలువలను బలవంతంగా నేర్పించదు.

→ మీ విలువలను పునఃపరిశీలించుకోండి - తీర్పు కోసం కాదు, అవగాహన కోసం.

→ మీ పిల్లల జీవితానికి ఆనందం, సార్థకత ఇచ్చే విలువల గురించి ఆలోచించండి.

→ మనం నేర్చుకున్నదానికన్నా పిల్లలు మెరుగ్గా నేర్చుకోవాలని మనందరి కోరిక.

పన్నెండు విశ్వవ్యాప్తవ విలువలు.

(Values of Being) :-

1. నిజాయితీ
2. ధైర్యం
3. శాంత స్వభావం
4. స్వయం ఆధారితత్వం & సామర్థ్యం
5. స్వీయ నియంత్రణ & మితాచారం
6. విశ్వాసం & పవిత్రత

ఇచ్చే విలువలు (Values of Giving):

7. నిబద్ధత & విశ్వసనీయత
8. గౌరవం
9. ప్రేమ
10. నిస్వార్థత & సున్నితత్వం
11. దయ & స్నేహభావం
12. న్యాయం & కరుణ

ఎలా? (HOW?)


- తల్లిదండ్రుల స్వయంఉదాహరణే అత్యుత్తమ బోధన.
- మనం చేసే పనులు -- మనం చెప్పే మాటలకన్నా ఎక్కువ ప్రభావం చూపుతాయి.
- ఒక నెల - ఒక విలువపై దృష్టి పెట్టండి.
- కథలు, ఊహాత్మక పరిస్థితులు (scenarios), ఆటలు ఉపయోగించండి.
- పిల్లలతో మాట్లాడే సమయం పెంచండి - ఇది నైతిక వికాసానికి చాలా అవసరం.
- మంచి ప్రవర్తనను గుర్తించి, ప్రశంసించండి.
- బహుమతులు, గుర్తింపులు ప్రోత్సాహకరంగా ఉంటాయి.

(తరువాయి భాగం వచ్చే సంచికలో ...)

# మన సంస్కృతి-మహావారధి

**పుస్తక పరిచయం**
**సంస్కృతి బోధమాల-3**

**పుస్తక పరిచయం :** అద్దేపల్లి నరసింహారావు




గతానికి భవితకు వారధి అయిన మన భారతీయ సంస్కృతిని వివరించే బోధమాల పుస్తకాలను పరిచయం చేసే వ్యాసాల పరంపరలో ఈ వ్యాసం మూడవది. స్ఫూర్తి పత్రిక మార్చి, ఏప్రిల్ నెలలలో మొదటి, రెండవ వ్యాసాలు ప్రచురితం అయ్యాయి. ప్రస్తుత వ్యాసంలో ఆరవ, ఏడవ, ఎనిమిదవ తరగతి పుస్తకాల విశేషాలను రేఖా మాత్రంగా వివరిస్తున్నాను.

ఆరవ, ఏడవ, ఎనిమిదవ తరగతి సంస్కృతి బోధమాల పుస్తకాలు తరగతి గడుస్తున్న కొద్దీ విద్యార్థిని వందల మెట్లు ఉన్నత స్థాయికి తీసుకువెళతాయి. ఈ ఉన్నత స్థాయి మార్కుల పరంగా కాదు, సంస్కార పరంగా.


**మాన్ చిత్రపర్ చిత్ర్ ఖీంచియే పావన్ ధర్మ్‌స్థాన్ కే।**
**దర్శన్ హోంగే దిశా-దిశామే భారత్‌వర్ష్ మహాన్ కే ॥**

అఖండ భారతదేశ పటాన్ని తీసుకుని మన సంస్కృతికి సజీవ సాక్ష్యాలు అయిన కుంభమేళాలు మొదలైన ప్రదేశాలను గుర్తిస్తూ వెళ్ళండి. దేశంలో ఏ దిక్కున అయినా పవిత్ర స్థలాలు లేని ప్రదేశం ఉండదు. అందుకనే ఈ పుణ్యభూమి దేవభూమి అయింది.... అని ఆరవ తరగతి పుస్తకం పాఠంలో 'ఒక ప్రయోగం చేయండి' శీర్షిక క్రింద సూచించారు. ఎన్నో వేల పేజీలలో, లక్షల పదాలలో చెప్పాలనుకునే విషయాన్ని నాలుగు వాక్యాలలో మనసుకు హత్తుకునేలా రచయితలు పేర్కొన్నారు. 'ప్రపంచం మొత్తంలో ఏనది ఏ ఒడ్డున ఎక్కువ వైదిక సాహిత్యం రచించబడినది?' లాంటి ప్రశ్నోత్తరాలు, ఖాళీలు పూరించడం, జతపర్చడం లాంటి తదితర ప్రయోగాలు విద్యార్థిలో ఆసక్తిని పెంచుతాయి. భారతదేశం ప్రాచీన నామాలు, భారతీయ సంస్కృతి ఎందుకు చిరంజీవి అయింది, సంస్కారాలు, మన విశ్వాసాలకు వైజ్ఞానిక ఆధారాలు ... ఇలా ఆరవ తరగతి పుస్తకంలో ప్రత్యక్షరం విద్యార్థిలో జిజ్ఞాసను పెంచుతుంది.



**వందేమాతర మంత్రం:-**

వందేమాతర గీతానికి గాత్రదానం చేసిన దెవరు? దేశమంతా ఈ గీతాన్ని ఒక్కగొంతుతో ఆలపించడానికి దారి తీసిన పరిస్థితులేమిటి? ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానంగా ఏడవ తరగతి పుస్తకంలో ఉన్న వ్యాసం ప్రేరణాదాయకం అయినది. వేదగణితం, భారతీయ కాలగణన, వాస్తుకళ, ఖగోళశాస్త్రం, చతుషష్టి కళలు, సంగీతం తదితర శాస్త్రీయ, సాంస్కృతిక అంశాలపై ఆసక్తికర సంక్షిప్త వ్యాసాలు విద్యార్థి మానసిక ప్రపంచాన్ని జ్ఞాన తృష్ణతో ఉత్తేజపరుస్తాయి. మాతృభాష పట్ల గౌరవం, ఆహారం-విహారం, కుటుంబ వ్యవస్థ, మన సాంస్కృతిక చిహ్నాలు... ఈ వ్యాసాలన్నీ రచయితల పరిశోధన, రచనా సామర్థ్యానికి చిహ్నంగా నిలుస్తాయి. సంక్లిష్టమైన విషయాలను సరళంగా చెప్పడం అతి గొప్పకళ. ఆ కళ ఈ పుస్తకాలలో అణువణువునా కనబడుతుంది.



8వ తరగతి పుస్తకం విద్యార్థిని మరింత ముందుకు తీసుకు వెళుతుంది. 'అఖండ భారత్-సాంస్కృతిక భారత్ పరిచయం', 'ఆచార్య-శిష్య సంవాదం:జగద్గురు శంకరాచార్య',.. తదితర పాఠ్యాంశాలు విద్యార్థిని కొత్త జ్ఞానంతో అలరిస్తాయి. ఈ పుస్తకా లన్నింటిలోనూ ఉన్న బాల సాహసుల గాథలు చదివిన వారు ఎప్పటికీ మరచిపోలేనివి. పుస్తకాల చివరలో ప్రశ్న పత్రం నమూనాలు ఇచ్చారు. విద్యార్థి ఏమి నేర్చుకున్నారు, ఎంత నేర్చుకున్నారు అంచనా వేసే పద్ధతిలో ఈ ప్రశ్న పత్రాలు ఉన్నాయి. ★

**ప్రచురణ**

శ్రీ సరస్వతీ విద్యాపీఠం, ఇం.నెం.6-3-597/ఎ/7, వెంకటరమణకాలని, ఖైరతాబాద్, హైదరాబాద్-500004, ఫోన్.నెం.040-23316084, 9441866647లో సంప్రదించవచ్చు.

**నిర్వహణ**

శ్రీ సరస్వతీ విద్యాపీఠం-తెలంగాణ, విద్యాభారతి-ఆంధ్రప్రదేశ్

# సామాన్య మనిషి తలుచుకుంటే ప్రపంచ గమనాన్నే మార్చేయగలడు

- గౌరుగారి గంగాధర రెడ్డి

ఒక సామాన్య మనిషి తలచుకుంటే ప్రపంచ గమనాన్నే మార్చేయగలడు అనడానికి ఈ ఘటనే సజీవ సాక్ష్యం. వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా ఇది అక్షరాలా నిజం!

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌కు చెందిన శైలేంద్ర కుమార్ సింగ్ గౌర్ అనే ఓ సాధారణ సైన్స్ గ్రాడ్యుయేట్ చేసిన అద్భుతం ఇప్పుడు దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. పెరుగుతున్న ఇంధన ధరలు, విపరీతమైన కాలుష్యానికి చెక్ పెట్టాలనే ఉద్దేశ్యంతో, ఎటువంటి ఇంజనీరింగ్ నేపథ్యం లేకపోయినా ఒక విప్లవాత్మకమైన "సిక్స్-స్ట్రోక్ ఇంజిన్" (Six-Stroke Engine) ను ఆయన ఆవిష్కరించారు.

ఇది రాత్రికి రాత్రే జరిగిన అద్భుతం కాదు. దీని వెనుక దాదాపు 18 నుంచి 20 సంవత్సరాల సుదీర్ఘ కృషి ఉంది. కేవలం ఒక కల కోసం ఆయన తన సొంత ఇల్లు, భూమి, వ్యాపారం చేసే దుకాణం, చివరికి తన భార్య నగలు కూడా అమ్మేశారు. ఒక చిన్న అద్దె ఇంటినే ఒక ల్యాబ్‌గా మార్చుకున్నారు. బంధువుల హేళనలను మౌనంగా భరించారు, ప్రయోగాల కోసం పిల్లల చదువులను సైతం త్యాగం చేశారు.

ఆయన పడిన కష్టానికి ఫలితంగా ఒక అద్భుతమైన ఇంజిన్ తయారైంది. సాధారణ ఇంజిన్లు కేవలం 30% ఇంధన శక్తిని వినియోగించుకుంటే, ఈ సిక్స్-స్ట్రోక్ ఇంజిన్ ఏకంగా 70% శక్తిని వాడుకుంటుంది. కేవలం 1 లీటర్ పెట్రోల్‌తో 176 కిలోమీటర్ల నుంచి 200 కిలోమీటర్ల వరకు మైలేజ్ ఇవ్వడం దీని ప్రత్యేకత. అంతేకాదు, ఇది పెట్రోల్, డీజిల్, సీఎన్జీ, ఇథనాల్ వంటి బహుళ ఇంధనాలతో నడుస్తుంది మరియు దాదాపు జీరో కాలుష్యాన్ని ఇస్తుంది. టీవీ లైవ్ డెమోలో సైతం పాత టీవీఎస్ బైక్‌పై ఈ ఇంజిన్ 120 కిలోమీటర్ల ప్రాక్టికల్ మైలేజ్ ఇచ్చి అందరినీ ఆశ్చర్యపరిచింది. భారత ప్రభుత్వం నుంచి ఈ అద్భుతమైన ఆవిష్కరణకు రెండు పేటెంట్లు కూడా లభించాయి.

ఇలాంటి అద్భుతమైన ఆవిష్కరణలు సామాన్యులకు చేరాలంటే ప్రభుత్వాల నుంచి సరైన leadership మరియు పటిష్టమైన governance ఎంతో అవసరం. మన democracy లో పౌరుల ప్రతిభకు గుర్తింపు దక్కాలి. ప్రభుత్వ విధానాల్లో transparency మరియు వ్యవస్థల్లో accountability ఉన్నప్పుడే నిజమైన public service జరిగినట్లు. ఏ విధమైన politics ఇలాంటి దేశీయ ప్రతిభను అడ్డుకోకూడదు. ఈ ఇంజిన్ వల్ల దేశ ఇంధన దిగుమతి బిల్లు భారీగా తగ్గుతుంది, రైతుల ఖర్చులు సగానికి సగం ఆదా అవుతాయి.

ఒక మనిషి తన జీవితకాలం పోరాడి దేశం కోసం ఒక వజ్రాన్ని సృష్టిస్తే, దానిని సానబట్టి ప్రపంచానికి అందించాల్సిన బాధ్యత ఇప్పుడు మనందరి పైనా ఉంది!

...... శ్రీ సరస్వతీ విద్యా పీఠము ప్రాంత సేవా విభాగము. ★

**అరవిందులు ఇలా అన్నారు :**

**ఏ దేశపు యువత హృదయాలు తమ దేశపు గతం పట్ల గౌరవంతో, వర్తమానమును గూర్చిన వేదనతో, భవిష్యత్తునకు సంబంధించిన బంగారు కలలతో, నిండి యుంటాయో ఆ దేశం ప్రగతి పథంలో పరుగులు తీస్తుంది.**

# బారిపడా గ్రామ రక్షకుడు

# పద్మశ్రీ చైత్‌రామ్ పవార్



**మా**నవ సంకల్ప బలానికి అసాధ్యమైనది ఏదీ లేదని నిరూపించారు మహారాష్ట్రలోని ధులే జిల్లా, బారిపడా గ్రామానికి చెందిన పద్మశ్రీ చైత్‌రామ్ పవార్. తమ జీవితాలను మార్చమని ప్రభుత్వం కోసం ఎదురుచూడకుండా, చైత్‌రామ్ పవార్ నాయకత్వంలో బారిపడా ప్రజలు తమ గ్రామాన్ని, తమ తలరాతను తామే మార్చుకున్నారు. నేడు ప్రభుత్వం సహా అనేక సంస్థలు వారి అభివృద్ధి నమూనాను చూసి నేర్చుకోవడానికి క్యూ కడుతున్నాయి. గిరిజన సంక్షేమం మరియు పర్యావరణ పరిరక్షణ రంగంలో ఆయన చేసిన కృషిని గుర్తిస్తూ భారత ప్రభుత్వం ఈ ఏడాది ఆయనకు 'పద్మశ్రీ' పురస్కారాన్ని అందించింది.

శ్రీ చైత్‌రామ్ పవార్ 'కొంకణ' తెగకు చెందినవారు. ఒక పేద, నిరక్షరాస్య కుటుంబం నుండి వచ్చిన ఆయన, ఎం.కామ్ (M.Com) పూర్తి చేసిన తర్వాత తన గ్రామానికి తిరిగి వచ్చారు. అప్పట్లో ఆ గ్రామం పేదరికం, నిరక్షరాస్యత మరియు మద్యపాన వ్యసనంతో కొట్టుమిట్టాడుతోంది. ప్రకృతి పరిరక్షణ మరియు అభివృద్ధి ద్వారా తన గ్రామాన్ని స్వయంసమృద్ధం చేయడమే లక్ష్యంగా పవార్ అడుగులు వేశారు.

ముంబైకి 400 కిలోమీటర్ల దూరంలో, మహారాష్ట్ర–గుజరాత్ సరిహద్దులో ఉన్న బారిపడా కేవలం 108 గిరిజన కుటుంబాలు, 785 జనాభా కలిగిన చిన్న గ్రామం. 1980 మరియు 90వ దశకాల్లో భారీగా అడవుల నరికివేత వల్ల కట్టెలు, ఆహారం మరియు నీటి ఎద్దడి ఏర్పడింది. ఒకప్పుడు పచ్చగా ఉన్న కొండలు బోడిగా మారాయి. 35 బావుల్లో నీరు అడుగంటిపోయింది. ఆదాయం లేక గ్రామ మహిళలు సారా తయారీని వృత్తిగా చేసుకున్నారు. మద్యపానం వల్ల గ్రామ సామాజిక, ఆర్థిక పరిస్థితి దిగజారింది.

అనేక ఉద్యోగ అవకాశాలను వదులుకుని, చెత్‌రామ్ పవార్ తన గ్రామంలోనే ఉండి అభివృద్ధి కోసం పనిచేయాలని నిర్ణయించుకున్నారు. స్థానిక స్వచ్ఛంద సంస్థ 'వనవాసి కల్యాణ ఆశ్రమం' కార్యకర్త గజానన్ పాతక్ సహకారంతో గ్రామస్థులను ఏకం చేసి స్వయం అభివృద్ధికి పునాది వేశారు. అడవులను నరికివేస్తే భవిష్యత్తులో పండ్లు, కట్టెలు కూడా దొరకవని ప్రజలకు వివరించి, అటవీ సంరక్షణ కోసం ఒక అనధికారిక 'అటవీ సంరక్షణ కమిటీ' (FPC) ని ఏర్పాటు చేశారు. అడవిలో రకరకాల చెట్లను నాటడమే కాకుండా, జీవవైవిధ్యాన్ని రికార్డు చేయడం ప్రారంభించారు.

తరువాత అటవీ శాఖ కూడా పవార్ కార్యక్రమాలకు మద్దతు ఇచ్చింది. 'సంయుక్త అటవీ నిర్వహణ' (Joint Forest Management) పథకాన్ని గ్రామంలో ప్రారంభించారు. ఈ చొరవ పొరుగు గ్రామాలకు కూడా విస్తరించి, గ్రామస్థుల అధ్వర్యంలో ఒక పెద్ద సంరక్షిత అటవీ ప్రాంతం ఏర్పడింది. నేడు గ్రామం చుట్టూ 445

హెక్టార్ల దట్టమైన అడవి ఉంది. ఇందులో చిరుతపులులు, తోడేళ్లు, నక్కలు వంటి ఎన్నో వన్యప్రాణులు ఉన్నాయి. ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమం (UNDP) ప్రతినిధులు, విదేశీ విద్యార్థులు ఇక్కడి జీవవైవిధ్యాన్ని అధ్యయనం చేయడానికి వస్తుంటారు.

నీటి ఎద్దడిని తీర్చడానికి చిన్న చిన్న చెక్ డ్యామ్‌ల నిర్మాణం అద్భుత విజయాన్ని అందించింది. ఇప్పటివరకు 700కు పైగా చెక్ డ్యామ్‌లను నిర్మించారు. భూగర్భజలాలను పెంచడానికి గ్రామస్థులు శ్రమదానంతో 5 కిలోమీటర్ల పొడవైన కాలువను తవ్వారు. దీని ఫలితంగా, 1990లలో మంచినీటి కోసం 3 కిలోమీటర్లు నడిచే ఈ గ్రామం, ఇప్పుడు పొరుగున ఉన్న ఐదు గ్రామాలకు నీటిని సరఫరా చేస్తోంది.

ఇక్కడి వ్యవసాయం పూర్తిగా పశువులపై ఆధారపడి ఉంటుంది. వీరు హైబ్రిడ్ విత్తనాలను వాడరు. స్థానిక విత్తనాల ద్వారానే అద్భుతమైన దిగుబడి సాధిస్తున్నారు. జన్యుమార్పిడి (GM) పంటలను ప్రోత్సహించే శాస్త్రవేత్తలకు ఈ గ్రామం ఒక గొప్ప పాఠం. 'జనసేవ ఫౌండేషన్' సహకారంతో వరి, గోధుమ, బంగాళదుంపలు మరియు కూరగాయల సాగును చేపట్టారు. ఆసియా స్థాయి పోటీలో బారిపడా "గ్రామీణ పేదల ఆవిష్కరణ" అవార్డును గెలుచుకుంది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రూ॥1,00,000 బహుమతి డబ్బుతో గ్రామంలో బెల్లం తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు, ఇది 25 మంది యువకులకు ఉపాధినిస్తోంది.

ఆర్థిక సాధికారత కోసం స్వయం సహాయక బృందాలను (SHGs) ఏర్పాటు చేశారు. మద్యపాన వ్యసనాన్ని తగ్గించడానికి కఠినమైన చర్యలు తీసుకున్నారు. సారా తయారీ చేసే కుటుంబాలు ఇప్పుడు చేపల వేటను వృత్తిగా మార్చుకున్నాయి. అభివృద్ధిలో భాగంగా రాత్రి పాఠశాలలను తెరిచారు. బడికి రాని విద్యార్థులకు, ఉపాధ్యాయులకు జరిమానా విధిస్తారు. ఖర్చులను తగ్గించుకోవడానికి అందరూ కలిసి సామూహిక వివాహాలు చేసుకుంటారు. ఈ మార్పును చూసి సమీపంలోని 20 గ్రామాలు కూడా ఇదే బాటలో నడుస్తున్నాయి.

చైత్‌రామ్ పవార్ 'బారిపడా గ్రామ వికాస సమితి' (BGVS) అనే సంస్థను నడుపుతున్నారు. ఆయన కృషికి గాను మహారాష్ట్ర ప్రభుత్వ 'శేతినైష్ఠ షేత్కారీ' అవార్డు సహా 12కు పైగా పురస్కారాలు లభించాయి. ఇంతటి విజయం సాధించినా పవార్ గారు ఎంతో వినమ్రంగా ఉంటారు. "గ్రామస్థుల సహకారం లేకుండా ఇది సాధ్యం కాదు" అని ఆయన అంటారు.

ప్రకృతి వనరులను కాపాడుకుంటే కరువును జయించవచ్చని ఆయన నిరూపించారు. ఆయన మాటల్లో చెప్పాలంటే: "ప్రతిదానికీ ప్రభుత్వంపై ఆధారపడితే ఆశించిన ఫలితాలు రావు. మనమే మొదలుపెట్టి, ప్రభుత్వం మనల్ని అనుసరించేలా చేయడమే సరైన మార్గం."

నిజమైన నాయకుడు, పర్యావరణ యోధుడు చైత్‌రామ్ దేవ్‌చంద్ పవార్ గారి ప్రయాణం మనందరికీ స్ఫూర్తిదాయకం. ... వనవాణి సౌజన్యంతో. ★



**బాదేపల్లి :–** శ్రీ సరస్వతీ శిశుమందిర్ ఇంగ్లీష్ మీడియం బాదేపల్లి పాఠశాలలో ప్రీ ప్రైమరీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహిరు. ఈ కార్యక్రమంలో శ్రీమతి చిగుళ్లపల్లి పద్మలీల పాఠశాల అధ్యక్షురాలు, శ్రీ నోములకృష్ణయ్య పాఠశాల ఉపాధ్యక్షులు, శ్రీ ముచ్చర్ల శ్రీకాంత్ పాఠశాల కార్యదర్శి , శ్రీ జి ప్రవీణ్ కుమార్ పాఠశాల సభ్యులు, శ్రీ శాగ లక్ష్మీనారాయణ, జడ్చర్ల టౌన్ పాఠశాల కార్యదర్శి మరియు శ్రీ డి. కనకప్ప సలహా సమితి సభ్యులు, ప్రధానాచార్యులు, ఆచార్యులు విద్యార్థులు పాల్గొన్నారు. ★

వార్తలు

## విద్యాపీఠ ఆవిర్భావ వేడుకలు



**బుధవార్‌పేట్ :–** నిర్మల్ పట్టణంలోని బుధవార్‌పేట్ శ్రీసరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో సరస్వతీ విద్యాపీఠ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల అధ్యక్షుడు ముప్పిడి రవి మాట్లాడుతూ శ్రీరాముని గుణగణాలను ఆదర్శంగా తీసుకొని శిశుమందిరాలు ఉద్భవించాయని, దేశవ్యాప్తంగా శాఖోపశాఖలుగా విస్తరించాయన్నారు. పలువురు విద్యార్థులు సీతారాముడు, హనుమాన్ వేషధారణలో ఆకట్టుకున్నారు. అనంతరం విద్యాపీఠ ఆవిర్భావ నిధి సమర్పణ చేపట్టారు. ప్రధానోపాధ్యాయుడు కొండూరు నరేశ్, చుక్కాపురం వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. ★

## గణపతి మరియు సరస్వతీమాత విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమము



**సదాశివపేట:–** శ్రీ సరస్వతీ శిశుమందిర్ సదాశివపేట పాఠశాలలో గణపతి మరియు సరస్వతీ మాత విగ్రహ ప్రతిష్ఠాపన చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నవగ్రహాల పూజ యజ్ఞం అభిషేకం నిర్వహించారు. విద్యార్థులు అభినయ గేయాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా డాక్టర్ ॥ యస్.వి. రాంప్రసాద్ (డిస్ట్రిక్ట్ గవర్నర్ రోటరీ డిస్ట్రిక్ట్), మరియు చీఫ్ గెస్ట్ ఓదెల ప్రభు గుప్త (ప్రెసిడెంట్ ఆఫ్ రోటరీ క్లబ్ సదాశివపేట), శ్రీ శరచ్చంద్ర శ్రీమతి సంతోషిని (కోశాధికారి) గార్ల చేతుల మీదుగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీ నిజాంపూర్ అశోక్ (పాఠశాల అధ్యక్షులు), శ్రీ లక్ష్మణ్ (పాఠశాల కార్యదర్శి), శ్రీ సరాఫ్ శ్రీనివాస్ మరియు మిగతా కమిటీ మెంబర్స్, పోషకులు, మాతాజీలు, విద్యార్థులు, పాఠశాల ప్రధానాచార్యులు తమ్మలి సంగమేశ్వర్ పాల్గొన్నారు. ★



**వికారాబాద్:–** శ్రీ సరస్వతీ శిశు మందిర్ ప్రాథమిక పాఠశాలలో, శ్రీ గొడుగు సత్యనారాయణ గారు (పూర్వ ఆచార్య) శ్రీరామ నవమి మరియు వ్యవస్థాపక దినోత్సవ వేడుకల సందర్భంగా శ్రీరాముని జీవిత విశిష్టతను వివరిస్తూ, శ్రీ సరస్వతీ విద్యాపీఠం మరియు శిశు మందిరాల లక్ష్యాలను మరియు విద్యా విధానాన్ని హైలైట్ చేశారు. తనూజ గోవర్ధన్ గారు (కెనరా బ్యాంక్ వికారాబాద్ మేనేజర్) విలువలు మరియు నాణ్యమైన విద్యను అందించడంలో పాఠశాల చేస్తున్న కృషిని ప్రశంసించారు, ఇది యువ మనస్సులను పెంపొందించడానికి గొప్ప ఉదాహరణ అని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రదర్శనలను ఆమె అభినందించారు. ప్రిన్సిపాల్ ఆచార్య బృందం, ఇతర అతిథులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ★

## శ్రీ పట్టోళ్ళ రఘుపతి రెడ్డి గారి అస్తమయం.



పటోళ్ల రఘుపతిరెడ్డి గారు పాల్వంచలో ఇంజనీరుగ పనిచేశారు. అప్పుడు ఆర్.యస్.యస్.లో మండల కార్యవాహగ ఖమ్మం జిల్లా సహకార్యావాహగ బాధ్యతలు తీసుకొని పనిచేశారు. ఆ సమయంలో కమ్యూనిష్టులు మరియు నక్షలైట్ల ప్రభావం కొత్తగూడెం ఖమ్మం జిల్లాల్లో ఎక్కువగా ఉండేది. అయినా ధైర్యంగా భారత మాత సేవకై ఆర్.యస్.యస్. మాధ్యమంగా పనిచేశారు. పాల్వంచలో సరస్వతీ శిశుమందిర్ ప్రారంభించడంలో వీరి ప్రయత్నం ప్రముఖమైనది. వీరి ప్రోత్సాహంతోనే వీరి తమ్ముడు కీ॥శే॥పట్టోళ్ల రామిరెడ్డి గారు సంఘ ప్రచారక్‌గా వెళ్ళారు. దీర్ఘకాలం సేవలందించారు.

రఘుపతి రెడ్డిగారు పదవీ విరమణ తరువాత హైదరాబాద్ వచ్చి సేవా భారతిలో బాధ్యతలు తీసుకొని పనిచేశారు. బాలాజీ నగర్ (హైదరాబాద్)లో సేవా భారతి ఆధ్వర్యంలో నడుస్తున్న మాధవ విద్యానికేతన్‌కు వారు కార్యదర్శిగ కొంతకాలం సేవలందించారు. 30 మార్చి 2026న వారు పరమపదించారు. వారి కుటుంబ సభ్యులకు మనో ధైర్యాన్ని ప్రసాదించాలని, వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ శ్రీ సరస్వతీ విద్యాపీఠం శ్రద్ధాంజలి సమర్పిస్తోంది. ★

---




**బడంగ్‌పేట్ :–** శ్రీ సరస్వతి శిశు మందిర్ బడంగ్‌పేట్ పాఠశాల సలహా సమితి సభ్యులుగా సేవలందిస్తున్న శ్రీ రాళ్లగూడెం రామకృష్ణ రెడ్డి గారు తేది:15.04.2026న పరమపదించారు. వీరు బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షులుగా సేవలందించారు. వీరి ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతుణ్ణి ప్రార్థిస్తూ శ్రీ సరస్వతీ విద్యాపీఠం శ్రద్ధాంజలి ఘటించింది. ★

---



**బండ్లగూడ జాగీర్:–** శ్రీ సరస్వతీ విద్యాపీఠం శారదా ధామం బండ్లగూడజాగీర్, భాగ్యనగర్‌లో, మాతాజీగా సేవలందించిన శ్రీమతి నాగవల్లి గారు పరమపదించారు. వీరి ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతుణ్ణి ప్రార్థిస్తూ శ్రీసరస్వతీ విద్యాపీఠం శ్రద్ధాంజలి ఘటించింది. ★

---



**వినాయక్‌నగర్ :–** శ్రీ సరస్వతీ శిశుమందిర్ పూర్వ ఆచార్యులు, పూర్వ జిల్లా అధ్యక్షులు, వినాయక్‌నగర్ గట నాయక్ గా సేవలందించిన శ్రీ బూస సురేందర్ గారు పరమపదించారు. వీరి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తూ శ్రీసరస్వతీ విద్యాపీఠం శ్రద్ధాంజలి ఘటించింది. ★



**ముధోల్:–** ముధోల్ మండల కేంద్రములోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో "స్వశోధన్ ట్రస్ట్" వారి ద్వారా ఏర్పాటు చేయబడిన "కంప్యూటర్ ల్యాబ్"ను శ్రీ సరస్వతీ విద్యాపీఠం విభాగ్ పూర్వ అధ్యక్షులు డా॥దామోదర్ రెడ్డి గారు ప్రారంభించారు. ప్రస్తుతం 10.వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థుల ద్వారా విరాళం గా అందించబడిన "RO వాటర్ ప్లాంట్" ను పాఠశాల సమితి అధ్యక్షులు రవీంద్రనాథ్ పాండే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ధర్మపురి సుదర్శన్, పాఠశాల సమితి ఉపాధ్యక్షులు ముత్యాల కిషన్, పాఠశాల అధ్యక్షులు కొండావార్ సంజీవ్, కార్యదర్శి వేదపాఠక్ నిశికాంత్ గారు, సహ కార్యదర్శి దర్బార్ నవీన్, కోశాధికారి కోలేకర్ శంకర్, సభ్యులు కంది మానాజీ, కొండా వార్ సంతోష్, కంది దత్తాత్రి, జిందంవార్ వెంకటేష్, పూర్వ విద్యార్థులు బండారి శ్రీకాంత్, దర్బార్ నరేష్, ధర్మపురి రజనీష్, బాస్కరోళ్ల శేఖర్, ప్రధానాచార్యులు సారథి రాజు, అకడమిక్ ప్రముఖ్ స్వప్న శర్మ, ఆచార్యులు విద్యార్థులు పాల్గొన్నారు.




భీమ్‌గల్ :- భీమ్‌గల్ లోని శ్రీ సరస్వతీ విద్యామందిర్ హై స్కూల్లో నర్సరీ, ఎల్కేజీ, యూకేజీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

RNI No. : 32283
SPHOORTHY (MONTHLY)
Volume : 50 Issue : 05
May - 2026

Postal Reg. No. : D/RNP/HCD-1204/2024-26
Published on 25th of Every Month
Posted on 29th & 30th Every Month
Posting at BPC-IV Partika Channel, Nampally, Hyderabad-01



## వ్యాసరచన పోటీల్లో విద్యార్థి ప్రతిభ

**హాజీపూర్ :** అఖిల భారత స్థాయి వ్యాసరచన పోటీల్లో మంచిర్యాల జిల్లా రాంపూర్ చౌక్కారాం నగర్లోని శ్రీవిద్యారణ్య ఆవాస విద్యాలయ పదో తరగతి విద్యార్థి వజ్జల శ్రీరామ్ ప్రతిభ చూపాడు. పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, స్థానికులు అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యాలయ ప్రధానా చార్యులు రావుల రామన్న, విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

SRI VIDYARANYA INTERNATIONAL SCHOOL
(RUN BY SRI SARASWATHI VIDYAPEETHAM- TELANGANA) SRI SHARADADHAMAM, BANDLAGUDA JAGIR, HYD - 500086
CONGRATULATIONS TO TOPPERS & ALL THE STUDENTS
FOR SECURING 100% RESULTS IN CBSE BOARD EXAMS 2025-26




HIGHEST PERCENTAGE - 96.83%
ALL THE STUDENTS SECURED 1st DIVISION

If undelivered please return to : Sri Saraswathi Vidya Peetham, 6-3-597/A/7, Venkataramana Colony, Khairatabad, Hyd-04.